RNI No: TGTEL/25/A2649

VOICE OF PRAJALU

వాయిస్ ఆఫ్ ప్రజలు

ప్రజల గొంతుక - నిజం కోసం..

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMABAD ADILABAD

హైదరాబాద్ | గురువారం, అక్టోబరు 29, 2026 | తెలుగు దినపత్రిక | సంపుటి:1 | సంచిక : 171 | పేజీలు: 8 | వెల : రూ.1

సదర్ ఉత్సవాలకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వానం

నవంబర్ 4న ఎన్టీఆర్ స్టేడియంలో వేడుకలు

రాష్ట్ర పండుగగా ప్రకటించినందుకు

ముఖ్యమంత్రికి యాదవ సంఘం ప్రతినిధుల కృతజ్ఞతలు

ధర్నా చౌక్‌ను ఎత్తేసిన బీఆర్ఎస్‌కు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే అర్హత ఉందా?

ఓటు హక్కుల పరిరక్షణకు కాంగ్రెస్ పోరాటం..

రైళ్ల కేటాయింపులో కేంద్రం వివక్ష తగదు: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్: ప్రజాస్వామ్యం, నిరసన తెలిపే హక్కుల గురించి మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు గతంలో తమ పాలనలో అనుసరించిన విధానాలను గుర్తు చేసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. ఇందిరాపార్క్‌లో ధర్నా చౌక్‌ను ఎత్తివేసి ప్రజల నిరసన తెలిపే హక్కును పరిమితం చేసిన వారే ఇప్పుడు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు. బుధవారం సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ధర్నా చౌక్‌ను పునరుద్ధరించి ప్రజలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసేందుకు అవకాశం కల్పించిందని తెలిపారు. గతంలో నిరసనలకు అవకాశం కల్పించని నాయకులు ప్రస్తుతం తమ ప్రభుత్వంపై విమర్శలు చేయడం సమంజసమా అని ప్రశ్నించారు.

ఓటు హక్కుల పరిరక్షణే కాంగ్రెస్ ప్రధాన డిమాండ్

నవంబర్ 2న హైదరాబాద్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేపట్టనున్న పాదయాత్రపై స్పందిస్తూ, కేంద్రంలో నిరసనలకు ఆటంకాలు కల్పిస్తూ తెలంగాణలో పాదయాత్రలు నిర్వహించడం ఏమిటని మంత్రి ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ప్రతి రాజకీయ పార్టీకి తన అభిప్రాయాలను వ్యక్తం చేసే హక్కు ఉందని, అదే స్వేచ్ఛను అన్ని పార్టీలకు కల్పించాలని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా అర్హులైన ఓటర్ల ఓటు హక్కులు తొలగిపోతున్నాయనే అంశంపై కాంగ్రెస్ పార్టీ ఆందోళన వ్యక్తం చేస్తోందని తెలిపారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) ప్రక్రియలో ఓటర్లకు ఎదురవుతున్న సమస్యలను సమగ్రంగా పునఃపరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై గత నాలుగైదు నెలలుగా ఢిల్లీ కేంద్రంగా వివిధ రూపాల్లో నిరసనలు చేపట్టినా కేంద్ర ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల సంఘం స్పందించడం లేదని విమర్శించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని, ఆయన రాజీనామా చేయాలని లేదా చట్టప్రకారం పదవి నుంచి తొలగించాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోందని వివరించారు. ఓటు హక్కు కోల్పోయిన అర్హులైన పౌరుల వివరాలను పునఃపరిశీలించి, వారికి తిరిగి ఓటు హక్కు కల్పించే వరకు కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

ఢిల్లీ ర్యాలీకి రైళ్లు కేటాయించకపోవడం సమంజసం కాదు

ఓటు హక్కుల పరిరక్షణ కోసం నవంబర్ 1న ఢిల్లీలో భారీ ర్యాలీ నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి పిలుపునిచ్చాయని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివెళ్లేందుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో రైల్వే బోగీలు కేటాయించాలని కోరినా కేంద్రం నుంచి అనుమతులు లభించడం లేదని ఆరోపించారు. గత పది రోజులుగా తెలంగాణతో పాటు దేశంలోని పలు రాష్ట్రాల్లో ఇండియా కూటమి నాయకులు, కార్యకర్తలకు రైళ్ల కేటాయింపులో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. రాజకీయ కార్యక్రమాలకు రైళ్లను కేటాయించే విషయంలో కేంద్ర ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని సూచించారు. రైల్వేలు కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ సొత్తు కాదని, అవి భారత ప్రజల ఆస్తి అని మంత్రి పేర్కొన్నారు. ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్యమిస్తూ, ప్రజాస్వామ్యబద్ధమైన కార్యక్రమాలకు అవసరమైన రవాణా సదుపాయాలు కల్పించాలని కోరారు.

కేంద్ర సంస్థల నిర్ణయాలపై ఆధారాలతో ప్రశ్నిస్తాం

ఎస్ఐఆర్ ప్రక్రియ, రైల్వే శాఖ వ్యవహారాలు, ఇతర కేంద్ర ప్రభుత్వ సంస్థల నిర్ణయాలపై తమ పార్టీ ప్రశ్నలు లేవనెత్తుతోందని మంత్రి తెలిపారు. ప్రజలకు సంబంధించిన అంశాల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలను ఆధారాలతో ప్రజల ముందుంచుతామని చెప్పారు. ప్రజాస్వామ్యబద్ధమైన నిరసనలను అడ్డుకోవడం, రాజకీయ కార్యక్రమాలకు ఆటంకాలు కల్పించడం వంటి చర్యలపై ప్రజాక్షేత్రంలో పోరాటం కొనసాగిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

హైదరాబాద్‌లో తాగునీటి కొరత రానివ్వొద్దు

ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకుని ముందస్తు చర్యలు చేపట్టాలి

ఎస్టీపీలు 100% సామర్థ్యంతో పనిచేయాలి..

నవంబర్ 1 నుంచి కొత్త ఆదేశాల అమలు: సీఎం రేవంత్

హైదరాబాద్, అక్టోబరు 28: రాజధాని హైదరాబాద్‌లో ఎట్టి పరిస్థితుల్లోనూ తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలను నిరంతరం పర్యవేక్షిస్తూ, తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో నీటి అవసరాలు పెరిగే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని నీటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. క్యూర్ పరిధిలో మంచినీటి సరఫరా, మురుగునీటి శుద్ధి కేంద్రాల (ఎస్టీపీలు) నిర్మాణం, శుద్ధి చేసిన నీటి వినియోగంపై ముఖ్యమంత్రి బుధవారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలోని బోధి పెవిలియన్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్టీపీలు వంద శాతం సామర్థ్యంతో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

శుద్ధి చేసిన నీటితోనే పచ్చదనం నిర్వహణ

సచివాలయం, ముఖ్యమంత్రి కార్యాలయం, ఔటర్ రింగ్ రోడ్డు, మెట్రో రైలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో పచ్చదనం నిర్వహణతో పాటు అవసరమైన పనులకు శుద్ధి చేసిన నీటినే వినియోగించాలని సీఎం సూచించారు. పబ్లిక్ పార్కులు, రోడ్ల శుభ్రతకు కూడా ట్రీటెడ్ వాటర్ ఉపయోగించాలని స్పష్టం చేశారు. భవన నిర్మాణాల్లో శుద్ధి చేసిన నీటినే వినియోగించాలనే నిబంధనను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రైవేట్ ఎస్టీపీల ఏర్పాటును ప్రోత్సహించాలని, డేటా సెంటర్లకు కూడా శుద్ధి చేసిన నీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్టీపీల నిర్వహణలో విద్యుత్ ఖర్చులను తగ్గించేందుకు సోలార్ విద్యుత్ వినియోగించే అవకాశాలను పరిశీలించాలని రెడ్కో అధికారులకు దిశానిర్దేశం చేశారు.

నీటి నాణ్యతలో రాజీ వద్దు

ఎస్టీపీల్లో నీటి శుద్ధికి అత్యాధునిక సాంకేతిక ప్రమాణాలను పాటించాలని, శుద్ధి చేసిన నీటి నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడొద్దని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రతి నీటిశుద్ధి కేంద్రం వద్ద ప్రత్యేక అధికారిని నియమించాలని, అన్ని ప్లాంట్లను కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానించి నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎస్టీపీల పనితీరును హైడ్రా ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. ట్రీటెడ్ వాటర్ సరఫరా చేసే ట్యాంకర్లకు జీపీఎస్ ఆధారిత ట్రాకింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని, శుద్ధి చేసిన నీటి వినియోగంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని చెప్పారు. వినియోగదారుల సౌలభ్యం కోసం ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

నవంబర్ 1 నుంచి కొత్త విధానం

ఎస్టీపీల నిర్వహణ, శుద్ధి చేసిన నీటి వినియోగానికి సంబంధించి నవంబర్ 1 నుంచి ఆదేశాలు అమల్లోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం 26 ఎస్టీపీల నుంచి గ్రీన్ ట్యాంకర్ల ద్వారా శుద్ధి చేసిన నీటిని పంపిణీ చేస్తున్నట్లు జలమండలి అధికారులు సమావేశంలో వివరించారు. వినియోగదారుల నుంచి కేవలం రవాణా ఖర్చులు మాత్రమే వసూలు చేస్తున్నామని, నీటిని ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని తాగునీటి సంరక్షణతో పాటు మురుగునీటి శుద్ధి, పునర్వినియోగానికి సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సీఎం సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లే భావితరాలకు విలువైన ఆస్తి

జనగణనలో ఓబీసీలకు ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేయాలి: కవిత

అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రంపై ఒత్తిడి తేవాలి.. లేకుంటే జనగణనను అడ్డుకోవాలి

హైదరాబాద్, అక్టోబరు 28: రిజర్వేషన్లే భావితరాలకు అందించే విలువైన ఆస్తి అని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. జనగణనలో ఓబీసీలకు ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేయాలని, ఇందుకోసం తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం స్పందించకపోతే రాష్ట్రంలో జనగణనను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కళ్యాణ మండపంలో ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్, తెలంగాణ బీసీ రైట్స్ ఫోరమ్ సంయుక్తంగా నిర్వహించిన హైదరాబాద్ ఓబీసీ డిక్లరేషన్ సభలో కవిత మాట్లాడారు. జనగణనలో ఓబీసీలకు ప్రత్యేక కాలమ్‌తోపాటు ప్రతి కులానికి ప్రత్యేక గుర్తింపు కోడ్ కేటాయించాలని కోరారు. తమిళనాడు తరహాలో అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఇచ్చిన హామీని రాష్ట్ర ప్రభుత్వం నిలబెట్టుకోవాలని అన్నారు. బీసీ రిజర్వేషన్ల బిల్లు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్నప్పటికీ, దానిపై రాష్ట్ర ప్రభుత్వం తగిన స్థాయిలో ఒత్తిడి తీసుకురావడం లేదని విమర్శించారు. ఓబీసీల జనాభా లెక్కలు వెల్లడైతే జనాభా దామాషా ప్రకారం హక్కులు కల్పించాల్సి వస్తుందనే ఉద్దేశంతోనే ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేయడం లేదని ఆరోపించారు. భూములు, బంగారం ఒకటి రెండు తరాలకు మాత్రమే ఉపయోగపడతాయని, రిజర్వేషన్లు తరతరాలకు ప్రయోజనం కలిగిస్తాయని కవిత పేర్కొన్నారు. విద్య, ఉద్యోగాలు, రాజకీయ రంగాల్లో బీసీలకు జనాభా దామాషా ప్రకారం వాటా కల్పించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఐక్యంగా పోరాడితేనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని అన్నారు. నవంబర్‌లో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఓబీసీ సంఘాలు నిర్వహించే ధర్నాలో తమ పార్టీ పాల్గొంటుందని ప్రకటించారు. సభలో ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ సూరజ్ మండల్ మాట్లాడుతూ.. ఓబీసీల హక్కుల కోసం కవిత చేస్తున్న పోరాటం దేశవ్యాప్త ఉద్యమానికి దోహదపడుతుందని అన్నారు. తమిళనాడుకు చెందిన రైట్స్ ఆఫ్ ఓబీసీ పార్టీ అధ్యక్షుడు తిరు రత్న సభాపతి మాట్లాడుతూ దేశంలోని అన్ని రంగాల్లో బీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. హైదరాబాద్ ఓబీసీ డిక్లరేషన్‌లో జనగణనలో ప్రత్యేక ఓబీసీ కాలమ్, ప్రతి కులానికి ప్రత్యేక యూనిక్ కోడ్, విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో జనాభా

దామాషా ప్రకారం వాటా, రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి తొలగింపు, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు తదితర డిమాండ్లను పొందుపరిచారు. ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా ఓబీసీ హక్కుల కోసం పోరాడుతున్న పలువురు నాయకులు పాల్గొన్నారు.

పదవీ విరమణ తర్వాతా దాన కిశోర్‌కు కీలక బాధ్యతలు

గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పునర్నియామకం

హైదరాబాద్, అక్టోబరు 28: తెలంగాణ సీనియర్ ఐఏఎస్ అధికారి దాన కిశోర్‌ను గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా రాష్ట్ర ప్రభుత్వం పునర్నియమించింది. ఈ నెల 31న పదవీ విరమణ చేయనున్న ఆయన, ఆ తర్వాత కూడా అదే పదవిలో కొనసాగనున్నారు. ఈ మేరకు రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) ఉత్తర్వులు జారీ చేసింది. 1996 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన దాన కిశోర్ సేవలను పదవీ విరమణ అనంతరం కూడా వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశాల మేరకు జీఏడీ జీఓ ఆర్టీ నంబర్ 1554ను విడుదల చేసింది. ప్రస్తుతం గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న దాన కిశోర్‌ను అదే బాధ్యతల్లో పునర్నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆయన నియామకానికి సంబంధించిన నిబంధనలు, షరతులను ప్రత్యేకంగా జారీ చేయనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.

ప్రభుత్వ ఉద్యోగుల విధుల్లో ఏఐ వినియోగం పెరగాలి

సాంకేతికతతో ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలి

'ఏఐ సాక్షమ్' శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, అక్టోబరు 28: మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరూ కృత్రిమ మేధస్సు (ఏఐ)పై అవగాహన పెంపొందించుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ప్రభుత్వ విధుల్లో ఏఐ సాధనాలను సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా పాలనలో వేగం, పారదర్శకత పెరగడంతోపాటు సామాన్య ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించవచ్చని అన్నారు. హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలో ప్రణాళికా శాఖ సహకారంతో టీజీ మ్యాథ్ ఆధ్వర్యంలో చేపట్టిన 'ఏఐ సాక్షమ్' కార్యక్రమాన్ని భట్టి విక్రమార్క ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యాలను పెంపొందించి, పరిపాలనా వ్యవస్థను ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రణాళికా శాఖ, టీజీ మ్యాథ్ ఆధ్వర్యంలో అందిస్తున్న ఏఐ శిక్షణను ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుంటూ, శిక్షణలో నేర్చుకున్న నైపుణ్యాలను రోజువారీ విధుల్లో అమలు చేయాలన్నారు.

పనుల్లో వేగం.. ప్రజలకు మెరుగైన సేవలు

ప్రభుత్వ కార్యాలయాల్లో రోజువారీగా నిర్వహించే పనులను వేగంగా, సమర్థంగా పూర్తి చేసేందుకు ఏఐ సాధనాలు ఎంతగానో ఉపయోగపడతాయని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులను గుర్తించడం, నివేదికలు రూపొందించడం, సమాచారాన్ని విశ్లేషించడం, సంక్లిష్టమైన వివరాలను ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా వివరించడం వంటి పనుల్లో ఏఐ ద్వారా సమయాన్ని ఆదా చేయవచ్చన్నారు. కార్యాలయాల్లో ఏఐ వినియోగంతో ఆదా అయ్యే సమయం తిరిగి ప్రజలకు మెరుగైన సేవల రూపంలో అందాలని స్పష్టం చేశారు. ప్రజల జీవితాల్లో కనిపించే సానుకూల మార్పులే ప్రభుత్వ వ్యవస్థలో ఏఐ వినియోగానికి అసలైన కొలమానమని వ్యాఖ్యానించారు.

సామాన్యుడికి మేలు జరగడమే లక్ష్యం

ఒక రైతు దరఖాస్తు త్వరగా పరిష్కారం కావడం, పింఛనుదారుడికి తనకు అందాల్సిన ప్రభుత్వ ప్రయోజనాలపై స్పష్టమైన సమాచారం లభించడం, ఒక పౌరుడు తన పని కోసం పదేపదే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం తగ్గడం వంటి మార్పులు ఏఐ వినియోగం ద్వారా సాధ్యం కావాలని భట్టి విక్రమార్క ఆకాంక్షించారు.

ఏఐ అనేది కేవలం సాంకేతిక పరిజ్ఞానం మాత్రమే కాదని, ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు ఉపయోగపడే శక్తివంతమైన సాధనమని పేర్కొన్నారు. ఉద్యోగులు శిక్షణలో చురుగ్గా పాల్గొని, తమ శాఖల అవసరాలకు అనుగుణంగా ఏఐ వినియోగంపై పట్టు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్లానింగ్ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్, డిప్యూటీ సీఎం కార్యదర్శి, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్, టీజీ మ్యాథ్ ఎండీ పూజ, ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ డైరెక్టర్ జనరల్ శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

సదర్ ఉత్సవాలకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వానం

నవంబర్ 4న ఎన్టీఆర్ స్టేడియంలో వేడుకలు

రాష్ట్ర పండుగగా ప్రకటించినందుకు ముఖ్యమంత్రికి యాదవ సంఘం ప్రతినిధుల కృతజ్ఞతలు

హైదరాబాద్, అక్టోబరు 28: హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో నవంబర్ 4న నిర్వహించనున్న సదర్ ఉత్సవాలకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డిని శ్రీకృష్ణ సదర్ సమ్మేళనం ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఆహ్వానించారు. ఈ మేరకు మంగళవారం జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి ఉత్సవాలకు హాజరుకావాలని ఆహ్వాన పత్రిక అందజేశారు. సదర్ ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కమిటీ ప్రతినిధులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. యాదవ సామాజిక వర్గ సంస్కృతి, సంప్రదాయాలు, వీరత్వం, పశుసంపదకు ఉన్న ప్రాధాన్యతను చాటిచెప్పే సదర్ ఉత్సవాలకు రాష్ట్రస్థాయి గుర్తింపు లభించడం సంతోషకరమని పేర్కొన్నారు. ప్రతి ఏడాది దీపావళి సందర్భంగా నిర్వహించే సదర్ వేడుకలు యాదవుల సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలుస్తున్నాయని, ఈ ఉత్సవాల ద్వారా సంప్రదాయ కళలు, పశుసంపద ప్రాముఖ్యత, సామాజిక ఐక్యతను ప్రజలకు తెలియజేసే అవకాశం కలుగుతుందని ప్రతినిధులు తెలిపారు. ఈ ఏడాది నిర్వహించనున్న ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో శ్రీకృష్ణ సదర్ సమ్మేళనం ఉత్సవ కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, యాదగిరిగుట్ట బోర్డు సభ్యురాలు ఈశ్వరమ్మ యాదవ్, మేడ్చల్ డీసీసీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ తదితర కమిటీ ప్రతినిధులు ఉన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై జనసేన సమరశంఖం

నల్గొండలో జిల్లా స్థాయి సమీక్ష సమావేశం

ఓటరు నమోదు వేగవంతం చేయాలి: డాక్టర్ గడల శ్రీనివాసరావు

నల్గొండ: ఖమ్మం--వరంగల్--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని జనసేన పార్టీ క్షేత్రస్థాయి కార్యాచరణను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా నల్గొండలోని హోటల్ విస్టా గ్రాండ్‌లో జనసేన పార్టీ జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర జాయినింగ్ కమిటీ కన్వీనర్ ముమ్మారెడ్డి ప్రేమకుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ గడల శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గడల శ్రీనివాసరావు మాట్లాడుతూ నల్గొండ జిల్లాలో జనసేన పార్టీకి బలమైన పునాది ఉందని, రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో జిల్లా కీలక పాత్ర పోషించనుందని అన్నారు. ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి నియోజకవర్గంలో క్షేత్రస్థాయికి వెళ్లి అర్హులైన పట్టభద్రులకు ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలన్నారు. ఎన్నికల ప్రచారాన్ని ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకెళ్లాలని, నాయకులు, వీర మహిళలు, జనసైనికులు సమష్టిగా కృషి చేసి పార్టీ విజయానికి కట్టుబడి పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర జాయినింగ్ కమిటీ సభ్యుడు ప్రజిత్ గౌడ్, రాష్ట్ర అధికార ప్రతినిధులు మిరియాల రామకృష్ణ, సాంబశివుడు, రాష్ట్ర నాయకులు వంగ లక్ష్మణ్ గౌడ్, కార్తీక్‌తో పాటు మునుగోడు, నకిరేకల్, మిర్యాలగూడ, నల్గొండ, దేవరకొండ, నాగార్జునసాగర్ నియోజకవర్గాల నాయకులు, జిల్లా నాయకులు, వీర మహిళలు, జనసైనికులు పాల్గొన్నారు.

తుపాను బాధితులకు అండగా నిలవాలి

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

ప్రభుత్వానికి జగన్ కీలక సూచనలుల

సహాయక చర్యల్లో వైసీపీ శ్రేణులు పాల్గొనాలి

రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ బకాయిలు విడుదల చేయాలి

తాడేపల్లి: ఆర్నాబ్ తుపాను నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రాణనష్టం జరగకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. బాధితులకు తక్షణ సహాయం అందించడంతో పాటు పునరావాస ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రభుత్వానికి సూచించారు. తుపాను బాధితుల కోసం పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి ఆహారం, తాగునీరు, మందులు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని జగన్ కోరారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పేర్కొన్నారు. తుపాను కారణంగా నష్టపోయే రైతులకు ప్రభుత్వం అండగా నిలవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న ఇన్‌పుట్ సబ్సిడీ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కోరారు. ఈ విపత్కర సమయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు రాజకీయాలకు అతీతంగా సహాయక, పునరావాస కార్యక్రమాల్లో పాల్గొని బాధితులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. మరోవైపు ఆర్నాబ్ తుపాను ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో జనజీవనం తీవ్రంగా ప్రభావితమైంది. గంటకు 135 కిలోమీటర్ల వేగంతో వీచిన ఈదురుగాలులు, భారీ వర్షాల కారణంగా పలు ప్రాంతాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. తుపాను ప్రభావంతో 100కు పైగా రైళ్లు రద్దయ్యాయి. భోగాపురం విమానాశ్రయానికి సంబంధించిన 28 విమాన సర్వీసులతో పాటు గన్నవరం విమానాశ్రయం నుంచి నడవాల్సిన అన్ని విమానాలను రద్దు చేశారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

అర్ణబ్ తుపాను బీభత్సం.. ఉప్పాడలో విలయం!

30 ఇళ్లు నేలమట్టం.. కొట్టుకుపోయిన బీచ్ రోడ్డుల

ఉత్తరాంధ్రలో కుండపోత.. విశాఖలో 315 మి.మీ. వర్షపాతంల

1.80 లక్షల మందికి పైగా ప్రజల తరలింపు.. సహాయక చర్యల్లో ప్రభుత్వం

విజయవాడ, అక్టోబరు 28: బంగాళాఖాతంలో ఏర్పడిన అర్ణబ్ అతి తీవ్ర తుపాను ఆంధ్రప్రదేశ్ తీరాన్ని అతలాకుతలం చేసింది. బుధవారం ఉదయం యానాం సమీపంలో తీరం దాటిన తుపాను సృష్టించిన విధ్వంసంతో కోస్తాంధ్రలో జనజీవనం స్తంభించింది. ఆరు గంటలకు పైగా కొనసాగిన తీరం దాటే ప్రక్రియలో బలమైన ఈదురుగాలులు, కుండపోత వర్షాలు ప్రజలను వణికించాయి. తుపాను బలహీనపడినప్పటికీ పలు జిల్లాల్లో భారీ వర్షాలు కొనసాగుతున్నాయి.

150 కి.మీ. వేగంతో గాలులు

భారత వాతావరణ శాఖ వివరాల ప్రకారం అర్ణబ్ తుపాను యానాం సమీపంలో తీరం దాటింది. ఆ సమయంలో గంటకు 125 నుంచి 135 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచగా, గరిష్ఠంగా 150 కిలోమీటర్ల వేగం నమోదైంది. ఉదయం 8.30 గంటల సమయంలో అతి తీవ్ర తుపాను నుంచి తీవ్ర తుపానుగా బలహీనపడింది. ఉదయం 9.50 గంటలకు తీరం దాటే ప్రక్రియ పూర్తయింది. అనంతరం తుపాను కేంద్రం నర్సాపురానికి 20 కిలోమీటర్ల తూర్పున, యానాంకు 40 కిలోమీటర్ల నైరుతి దిశలో కేంద్రీకృతమైంది.

ఉత్తరాంధ్రలో కుండపోత

తుపాను ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. బుధవారం ఉదయం 8.30 గంటల వరకు నమోదైన వివరాల ప్రకారం విశాఖపట్నంలో అత్యధికంగా 315 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. విజయనగరంలో 301, అనకాపల్లిలో 275, శ్రీకాకుళంలో 257, కృష్ణా జిల్లాలో 223 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఒడిశాలోని కోరాపుట్‌లో 188, గంజాంలో 161 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. తుపాను ముప్పు నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లోని తీరప్రాంతాల నుంచి 1.80 లక్షల మందికి పైగా ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అనేక ప్రాంతాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పాఠశాలలకు సెలవులు ప్రకటించగా, రైళ్లు, విమాన సర్వీసులు రద్దయ్యాయి. విశాఖపట్నం, విజయవాడ విమానాశ్రయాల నుంచి పలు సర్వీసులను నిలిపివేశారు. ఇప్పటివరకు రెండు రాష్ట్రాల్లో ప్రాణనష్టం సంభవించలేదని అధికారులు వెల్లడించారు.

ఉప్పాడ తీరంలో విలయం

అర్ణబ్ తుపాను ధాటికి కాకినాడ జిల్లాలోని ఉప్పాడ తీర ప్రాంతం తీవ్రంగా దెబ్బతింది. తెల్లవారుజామున ఎగసిపడిన భారీ సముద్రపు అలల ధాటికి ఉప్పాడ--కాకినాడ బీచ్ రోడ్డు పలు చోట్ల కొట్టుకుపోయింది. సుమారు 30 ఇళ్లు నేలమట్టమయ్యాయి. మరికొన్ని ఇళ్ల పైకప్పులు బలమైన గాలులకు ధ్వంసమయ్యాయి. సుబ్బంపేట, ఉప్పాడ, సూరడపేట, జగ్గరాజుపేట, పల్లిపేట, రంగంపేట, మాయాపట్నం గ్రామాల్లోకి సముద్రపు నీరు చొచ్చుకొచ్చింది. సుబ్బంపేట వద్ద తీర రక్షణ కోసం నిర్మించిన గోడ పూర్తిగా ధ్వంసమైంది. సముద్రపు అలల ఉధ్ధృతికి రక్షణగా ఏర్పాటు చేసిన భారీ బండరాళ్లు సైతం చెల్లాచెదురయ్యాయి. సుబ్బంపేట వద్ద బీచ్ రోడ్డు పూర్తిగా కొట్టుకుపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు ముందుజాగ్రత్తగా బీచ్ రోడ్డుపై వాహనాల రాకపోకలను నిలిపివేశారు. దెబ్బతిన్న ఇళ్లు, రహదారులను పరిశీలిస్తూ సహాయక చర్యలు చేపట్టారు. సముద్రం ఇంకా అల్లకల్లోలంగా ఉన్నందున ప్రజలు తీర ప్రాంతాలకు వెళ్లవద్దని హెచ్చరించారు.

రంగంలోకి మంత్రులు.. అధికారులతో సమీక్ష

తుపాను తీరం దాటిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సహాయక చర్యలను ముమ్మరం చేసింది. మంత్రులు నారాయణ, ఆనగాని సత్యప్రసాద్ అధికారులతో వేర్వేరుగా సమీక్షలు నిర్వహించారు. పురపాలక శాఖ మంత్రి నారాయణ మున్సిపల్ కమిషనర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి, రహదారులపై కూలిన చెట్లను యంత్రాల సహాయంతో వెంటనే తొలగించాలని ఆదేశించారు. ప్రమాదకరంగా మారిన హోర్డింగుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, రోడ్లు, డ్రెయిన్లలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పారిశుధ్య సమస్యలు, తాగునీటి కాలుష్యం తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మరోవైపు రెవెన్యూ శాఖ మంత్రి ఆనగాని సత్యప్రసాద్ అధికారులతో పరిస్థితిని సమీక్షించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో నష్టాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ ప్రజలకు అవసరమైన సహాయం అందించాలని ఆదేశించారు. తీర ప్రాంతాల్లో పరిస్థితి పూర్తిగా సాధారణ స్థితికి వచ్చే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

ఉస్మానియా ఆసుపత్రి పనులు వేగవంతం చేయాలి

నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్

రూ.2,700 కోట్లతో 2 వేల పడకల ఆసుపత్రి నిర్మాణం

హైదరాబాద్, అక్టోబరు 28:లి గోషామహల్‌లో నూతనంగా నిర్మిస్తున్న ఉస్మానియా జనరల్ ఆసుపత్రి పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం ఆయన ఆసుపత్రి నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. ఈ పర్యటనలో రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ మీర్జా రియాజ్ ఉల్ హుసేన్, జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆలా, మెట్టు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి నమూనా డిజైన్లను పరిశీలించిన మంత్రి, నిర్మాణంలో ఉన్న వివిధ బ్లాక్‌లను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం ఇప్పటివరకు ఎంత మేరకు పనులు పూర్తయ్యాయి? ఇంకా ఎన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయి? అనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్దేశిత ప్రణాళికతో పోలిస్తే కొన్ని పనుల్లో జాప్యం జరుగుతున్నట్లు గుర్తించిన మంత్రి, ఇకపై ఎలాంటి ఆలస్యం లేకుండా నిర్మాణ పనులను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. ఉస్మానియా జనరల్ ఆసుపత్రి నిర్మాణాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని మంత్రి తెలిపారు. దాదాపు రూ.2,700 కోట్ల వ్యయంతో 2 వేల పడకల సామర్థ్యంతో నిర్మిస్తున్న ఈ ఆసుపత్రి భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా అత్యాధునిక వైద్య సదుపాయాలతో రూపుదిద్దుకుంటోందని పేర్కొన్నారు. నిర్మాణ నాణ్యత విషయంలో రాజీ పడకుండా, నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలి : టీడబ్ల్యూజేఎఫ్ డిమాండ్

మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లాలో ఘనంగా ఐఎఫ్ డబ్ల్యూజే వ్యవస్థాపక వేడుకలు

కుత్బుల్లాపూర్ అక్టోబర్ 28(వాయిస్ టుడే) జర్నలిస్టుల రక్షణకు కేంద్ర ప్రభుత్వం వెంటనే ప్రత్యేక చట్టం తీసుకురావాలి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిడి సోమయ్య, తన్నీరు శ్రీనివాస్ లు డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేసన్ మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారంలోని బాబు జగ్జవన్ రాం, అంబేద్కర్ భవన్ లో ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐఎఫ్ డబ్ల్యూజే)76వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని పలువురు సీనియర్ జర్నలిస్టులను ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... జర్నలిస్టుల జాతీయ రిజిస్టర్ అమలు చెయ్యాలని, సీనియర్ పాత్రికేయుల కోసం జాతీయ పెన్షన్ పథకం అమలు చెయ్యాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ఢిల్లీతో సహా అన్ని రాష్ట్రాల్లో ఐఎఫ్ డబ్ల్యుజే వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయని, దీని అనుబంధ సంఘమైన టిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా వేడుకలు జరుగుతున్నాయని అన్నారు. ఐఎఫ్ డబ్ల్యుజే సంఘం ఏర్పడి 76 సంవత్సరాలు అవుతుందని, 1950లో కొందరు సీనియర్ జర్నలిస్టులతో ఏర్పడిన ఈ సంఘం దేశంలోనే మొట్టమొదటి జర్నలిస్టు సంఘం అని అన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో నేషనల్ కౌన్సిల్ సభ్యులు జగదీష్, టిడబ్ల్యూజేఎఫ్ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డమీది అశోక్ మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా జర్నలిస్టులపై దాడులు హత్యలు అక్రమ కేసులు వంటి సంఘటనలు పెరిగిపోతున్నాయని వీటిని అరికట్టి జర్నలిస్టులకు రక్షణ కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల జాతీయ రిజిస్టర్ దేశవ్యాప్తంగా జర్నలిస్టులకు కేంద్ర ప్రభుత్వం గుర్తింపు ఇవ్వడానికి అన్ని మీడియా సంస్థల్లో వెరిఫికేషన్ నిర్వహించే జాతీయ రిజిస్టర్ చేయాలన్నారు జాతీయ పెన్షన్ పథకం పథకం దేశవ్యాప్తంగా 60 ఏళ్లు పైబడిన సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్ సదుపాయం కల్పించేందుకు జాతీయ పెన్షన్ పథకం అమలు చేయాలని జర్నలిస్టు రైల్వే రాయితీ పాసులను పునరుద్ధరించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎంతో మంది జర్నలిస్టులు సొంత ఇండ్లు లేక అద్దె భవనాల్లో ఉంటూ జీవనం కొనసాగిస్తున్నారని జర్నలిస్టులకు ఇచ్చిన హామీల్లో భాగమైన ఇండ్ల స్థలాలు ఇండ్లు పూర్తిస్థాయిలో అక్రిడిటేషన్ కార్డులు హెల్త్ కార్డులు అందజేయాలన్నారు. ఈకార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ నేషనల్ కౌన్సిల్ సభ్యుడు కుంచం శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవికుమార్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నాగరాజ్ గౌడ్, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా నాయకులు పి.శంకర్, కావలి మోహన్, టిడబ్ల్యూజేఎఫ్ కుత్బుల్లాపూర్ ప్రధాన కార్యదర్శి ఏ గోవిందరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ శివకుమార్, కూకట్పల్లి టిడబ్ల్యూజేఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు యాకన్న, అంజి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నూతన పదాధికారులకు సన్మానం

నాచారం (వాయిస్ టుడే): బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, జీహెచ్ఎంసీ మాజీ మేయర్ బండ కార్తీక చంద్రారెడ్డి నూతనంగా నియమితులైన బీజేపీ నాయకులను ఘనంగా సన్మానించారు. బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమితులైన సుబ్బారావు, జిల్లా కార్యవర్గ సభ్యుడిగా నియమితులైన సతీష్ రెడ్డి, తార్నాక డివిజన్ ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా నియమితులైన కేదారిని ఆమె అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎన్. మల్లికంటి వీరన్న, కిరణ్ గౌడ్, టెంపుల్ సాయి, చింటూ, రాజ్కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

కుత్బుల్లాపూర్ అక్టోబర్ 28(వాయిస్ టుడే) కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ సర్కిల్ భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు స్వామివారిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా శంభీపూర్ రాజు స్వామి శ్రీనివాస్ రెడ్డి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నాగరాజు యాదవ్ , స్వామి మాలలో ఉన్న పీఏసీఎస్ చైర్మన్ బాల్ రెడ్డి , బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జిన్నారం వెంకటేష్ , బాలకృష్ణ రెడ్డి , పోలీస్ గోవింద్ రెడ్డి , మురళీ యాదవ్ , విష్ణువర్ధన్ రెడ్డి మరియు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే నిలయం వద్ద పోలీసులతో తోపులాట

ధర్నాలో కిందపడిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్

నాచారం (వాయిస్ టుడే):రైల్వే నిలయం వద్ద నిర్వహించిన మెరుపు ధర్నా సందర్భంగా పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య తోపులాట చోటుచేసుకుంది. ఈ క్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు కిందపడిపోయారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఏ సభ్యులు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సురేష్లాల్ నేతికర్ పాల్గొన్నారు .

బాచుపల్లి లోని జల్సా జంక్షన్ రెస్టారెంట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న కొలన్ హన్మంత్ రెడ్డి

కుత్బుల్లాపూర్ అక్టోబర్ 28(వాయిస్ టుడే) కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని బాచుపల్లి లో నూతనంగా ఏర్పాటు చేసిన జల్సా జంక్షన్ రెస్టారెంట్లిప్రారంభోత్సవ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రెస్టారెంట్ను ప్రారంభించారు.ఈ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, మేడ్చల్ మార్కెట్ యార్డ్ కమిటీ డైరెక్టర్ మాధవ్ రెడ్డి, డిసిసి సెక్రెటరీ గణేష్, మరియు తదితరులు పాల్గొన్నారు.

భువనగిరి పట్టణం 11వ వార్డులో 4.00 లక్షలు మురికి కాలువల పనులు ప్రారంభం

భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్

(యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో.. వాయిస్ టుడే ప్రతినిధి):- భువనగిరి పట్టణంలోని స్థానిక 11వ వార్డు యందు రూ.4.00 లక్షలు 15వ ఆర్థిక సంఘం నిధులతో అంతర్గత మురికి కాలువ నిర్మాణ పనులకు భువనగిరి చైర్ పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ కొబ్బరికాయలు కొట్టి పనులను ప్రారంభించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ గంజి శ్రీవాణీ గణేష్, అధికారులు మున్సిపల్ ఇంజనీర్,ఎంఏఇ, వార్డు ప్రజలు, నాయకులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

::: ప్రభుత్వ విప్పు ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

(యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో.. వాయిస్ టుడే ప్రతినిధి):- ఏఐసీసీ పిలుపు మేరకు నవంబర్ 1న నిర్వహించనున్న ఓటు బచావో - దేశ్ బచావో నినాదంతో 'ఛలో ఢిల్లీ' కార్యక్రమాన్ని విజయవంతం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అధ్యక్షతన భువనగిరిలోని వివేరా హోటల్లో జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు.ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ ఐ ఆర్)లో అక్రమాలు, కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, సీఈసీ జ్ఞానేష్ కుమార్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ, లోక్సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నాయకత్వంలో నవంబర్ 1న ఢిల్లీలో నిర్వహించనున్న భారీ ర్యాలీని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ఏఐసీసీ పరిశీలకులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి అండగా ఉంటాం

బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి

నాచారం (వాయిస్ టుడే): యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం నాయినంపల్లి గ్రామానికి చెందిన ముక్కుల శ్రీనివాస్ చారి ఆకస్మిక మృతి బాధాకరమని బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి అన్నారు. మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన ఆయన, వికలాంగుడైన కుమారుడు భానుతో పాటు తల్లి రాజమ్మకు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా గణేష్ చారి మాట్లాడుతూ శ్రీనివాస్ చారి కుటుంబానికి అన్ని వేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ కుల సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లభోజు నరసింహ చారి, అనంతోజు బ్రహ్మచారి, బాలకృష్ణ చారి, పెద్ద బ్రహ్మచారి తదితరులు పాల్గొని కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు.

రామంతాపూర్లో ఘనంగా సామూహిక హనుమాన్ చాలీసా పఠనం

హైదరాబాద్: అక్టోబర్ 28;(వాయిస్ టూ డే) రామంతాపూర్: శ్రీరామ హనుమాన్ భక్తి ప్రచార సమితి ఆధ్వర్యంలో రామంతాపూర్లోని శ్రీరామ సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో మంగళవారం సామూహిక హనుమాన్ చాలీసా పఠన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొని సామూహికంగా హనుమాన్ చాలీసా పఠించారు. ఈ సందర్భంగా భక్తి ప్రచార సమితి సభ్యులు మాట్లాడుతూ, ప్రతి హిందువు మంగళవారం, శనివారం హనుమాన్ చాలీసా పఠించడం ద్వారా జీవితంలో ఎదురయ్యే కష్టాలు, బాధలను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొనే స్ఫూర్తి లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు సంజీవ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

వాయిస్ టుడే
జనగాత్రం - మనవేత్రం
గురువారం, అక్టోబరు 29, 2026

మ్యాట్రిక్స్ పరిశ్రమలో కార్మికులపై వేధింపులు వెంటనే ఆపాలి

కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న
మైలాన్ పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి
సిఐటియు రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు అతిమేల మానిక్

సంగారెడ్డి జిల్లా పతాన్ చేరు వాయిస్ టుడే న్యూస్ పటాన్ చేరు : పటాన్చెరువు మండలం పాశమైలారం పారిశ్రామిక ప్రాంతంలోని మ్యాట్రిక్స్ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులపై యాజమాన్యం వేధింపులకు పాల్పడుతూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని సిఐటియు రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు అతిమేల మానిక్ అన్నారు ఈరోజు పాశమైలారం పారిశ్రామిక క్లస్టర్ సమావేశం జరిగింది ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మ్యాట్రిక్స్ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులను యాజమాన్యం తీవ్రంగా వేధింపులకు పాల్పడుతుందని అన్నారు. కార్మికులను తొలగిస్తూ రోడ్డును పడేస్తుందని అన్నారు. అనేకమంది కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నప్పటికీ వారికి చట్టం ప్రకారం బోనస్ ఇయల్స్ గ్రాట్యుటీ రావలసిన సౌకర్యాలు ఇవ్వడం లేదని అన్నారు. సేఫ్టీ యూనిఫామ్ షూ క్యాంటీన్ వంటి సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదని అన్నారు. కార్మికుల మీద బెదిరింపులకు పాల్పడుతూ కార్మికుల పొట్టలు కొడుతున్న మ్యాట్రిక్స్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సిఐటి డిమాండ్ చేస్తుందని అన్నారు లేనిపక్షంలో పరిశ్రమ ముందు ఆందోళన చేపడుతామని హెచ్చరించారు ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి నాగేశ్వరరావు జిల్లా కమిటీ సభ్యులు రాజు నాయకులు వెంకటేష్ శ్రీనివాస్ దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు..

వాల్మీకి మహర్షి ఆశయాలు సమాజానికి మార్గదర్శకం

మహనీయుల బోధనలను యువతకు చేరవేయాలి : మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి నీలం మధు ముదిరాజ్

వాయిస్ టుడే న్యూస్ , పతాన్ చేరు : వాల్మీకి మహర్షి ఆశయాలు, బోధనలు సమాజానికి ఎల్లప్పుడూ మార్గదర్శకంగా నిలుస్తాయని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నీలం మధు ముదిరాజ్ అన్నారు. మహనీయుల జీవిత చరిత్రలను యువతకు పరిచయం చేస్తూ, వారు చూపిన మార్గంలో నడిచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సంగారెడ్డి జిల్లా నారాయణ్ ఖేడ్ నియోజకవర్గం కంగ్టి మండలం, చాప్టా (కె) గ్రామంలో బుధవారం నిర్వహించిన వాల్మీకి మహర్షి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి డీసీసీ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి గారితో కలిసి ముఖ్య అతిథిగా హాజరై విగ్రహావిష్కరణ చేసి, ఆయన ఈ మేరకు ప్రసంగించారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ, వాల్మీకి మహర్షి జీవితం, ఆయన రచించిన రామాయణం తరతరాలకు స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. ధర్మం, సత్యం, న్యాయం, మానవతా విలువల ప్రాధాన్యాన్ని వాల్మీకి మహర్షి జీవితం చాటిచెబుతుందని నీలం మధు అన్నారు. సమాజంలో ఐకమత్యాన్ని పెంపొందిస్తూ, మహనీయుల ఆశయాలను ఆచరణలో పెట్టినప్పుడే వారి సేవలకు నిజమైన గౌరవం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. మహనీయుల చరిత్రను భావితరాలకు అందించడం ద్వారా యువతలో స్ఫూర్తి, సామాజిక బాధ్యత పెంపొందుతాయని తెలిపారు. విగ్రహావిష్కరణలు కేవలం వేడుకలకే పరిమితం కాకుండా, మహనీయులు చూపిన మార్గంలో నడిచేందుకు ప్రేరణ కలిగించాలని ఆయన సూచించారు. విద్య, సామాజిక అభివృద్ధి, సమానత్వానికి ప్రాధాన్యమిస్తూ అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్వేశ్వర అంబికా శివయోగి మహారాజ్, గుండు లక్ష్మణ్ స్టేట్ గ్రాంథిక మాజీ అధ్యక్షులు, గుండు మోహన్ మాజీ జెడ్పీటీసీ, సత్యనారాయణ మాజీ ఎంపీపీ, కౌన్సిలర్ రామకృష్ణ, సర్పంచులు శివరాజ్ పటేల్, కృష్ణ, సాయిలు పటేల్, వెంకటేష్, భూమయ్య, నాయకులు ప్రకాష్ రాథోడ్, వెంకట రాములు, రవి, వెంకన్న, ముచందర్, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, వాల్మీకి సంఘం నాయకులు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అండగా ఎమ్మెల్యే జిఎంఆర్

సొంత నిధులతో స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ

సంగారెడ్డి జిల్లా పతాన్ చేరు , వాయిస్ టుడే న్యూస్ పతాన్ చేరు : పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి క్రీడాకారుల పట్ల మరోమారు తన దాతృత్వాన్ని చాటుకున్నారు. స్వతహాగా క్రీడాకారుడు అయిన ఎమ్మెల్యే జిఎంఆర్ క్రీడాకారుల అభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్నారు. నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతాల్లో టోర్నమెంట్ ల నిర్వహణకు నిధులు అందిస్తూ క్రీడల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో నవంబర్ 1వ తేదీ నుండి 5వ తేదీ వరకు దేశ రాజధాని ఢిల్లీ కేంద్రంగా జరగనున్న 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాతీయస్థాయి కుస్తీ పోటీలకు తెలంగాణ రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్న అండర్-17 బాల బాలికల జట్లకు ఎమ్మెల్యే జిఎంఆర్ సొంత నిధులతో కొనుగోలు చేసిన స్పోర్ట్స్ కిట్లను క్రీడాకారులకు అందజేశారు. బుధవారం సాయంత్రం పటాన్చెరులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల పటాన్చెరు కేంద్రంగా ఎస్జిఎఫ్ రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలకు ఆతిథ్యం ఇవ్వడం జరిగిందని తెలిపారు. జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ రాష్ట్ర జట్టుకు లక్ష 50 వేల రూపాయల సొంత నిధులతో స్పోర్ట్స్ కిట్స్, భోజన వసతి, ప్రయాణ ఖర్చులు అందించడం జరిగిందని తెలిపారు. పటాన్చెరు నియోజకవర్గాన్ని క్రీడలకు కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. జాతీయస్థాయిలో అద్భుతమైన ప్రదర్శనతో తెలంగాణ రాష్ట్ర ఖ్యాతిని ఇనుమడింపచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ జి ఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, ఎంఈఓ నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, రామచంద్రారెడ్డి, శ్రీధర్ చారి, మాణిక్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, రామ్మోహన్, షకీల్, దస్తగిరి, కోచ్ సంగ్రామ్, పిఈటి గౌసుద్దీన్, క్రీడాకారులు పాల్గొన్నారు.

కేటీఆర్ పాస్‌పోర్ట్ వివాదం..

యథాతథ స్థితి కొనసాగించాలన్న హైకోర్టు

ఫార్ములా ఈ కేసులో కేటీఆర్‌కు తాత్కాలిక ఊరట
ఏసీబీ, పాస్‌పోర్ట్ అధికారులకు కోర్టు నోటీసుల జారీ
కేసు తదుపరి విచారణ నవంబర్ 6కు వాయిదా

ఫార్ములా ఈ రేస్ నిధుల మళ్లింపు కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ రామారావుకు తెలంగాణ హైకోర్టులో తాత్కాలిక ఊరట లభించింది. ఆయన పాస్‌పోర్ట్‌కు సంబంధించి జారీ అయిన నోటీసుల విషయంలో యథాతథ స్థితి (స్టేటస్ కో) కొనసాగించాలని న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఫార్ములా ఈ కేసులో విచారణ జరుపుతున్న అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ), కేటీఆర్ పాస్‌పోర్ట్‌ను స్వాధీనం చేసుకోవాలని కోరుతూ ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయానికి (ఆర్‌పీవో) లేఖ రాసింది. ఏసీబీ అభ్యర్థన మేరకు పాస్‌పోర్ట్ అధికారులు కేటీఆర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులను సవాలు చేస్తూ కేటీఆర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం, పాస్‌పోర్ట్ నోటీసుల ప్రక్రియలో యథాతథ స్థితిని పాటించాలని ఆదేశించింది. ప్రతివాదులుగా ఉన్న ఏసీబీ, పాస్‌పోర్ట్ అధికారులకు నోటీసులు జారీ చేస్తూ, వారి వాదనలను కౌంటర్ అఫిడవిట్ రూపంలో సమర్పించాలని సూచించింది. అనంతరం, కేసు తదుపరి విచారణను నవంబర్ 6వ తేదీకి వాయిదా వేసింది. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులతో కేటీఆర్ పాస్‌పోర్ట్‌ను స్వాధీనం చేసుకునే ప్రక్రియకు ప్రస్తుతానికి అడ్డుకట్ట పడినట్లయింది.

హైదరాబాద్ జట్టుకు

సైఖైన్ అఫ్రాత్ ఆల్‌రౌండ్ ప్రదర్శన..

ఆంధ్రపై మ్యాచ్‌లో
7 వికెట్లు, అజేయ అర్ధశతకంతో సత్తా..

సికింద్రాబాద్, అక్టోబర్ 28 (వాయిస్ టుడే ప్రతినిధి): సీనియర్ పురుషుల ఎమర్జింగ్ ప్రీమియర్ లీగ్‌లో ఆంధ్ర జట్టుతో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్‌కు ప్రాతినిధ్యం వహించిన యువ క్రికెటర్ మహమ్మద్ సైఖైన్ అఫ్రాత్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. బంతితో ప్రత్యర్థి బ్యాటర్లను కట్టడి చేయడంతో పాటు, బ్యాట్‌తోనూ కీలక పరుగులు సాధించి జట్టు తరఫున తన ప్రతిభను చాటుకున్నాడు. మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో బౌలింగ్ చేస్తూ 17 ఓవర్లలో 54 పరుగులిచ్చి 2 వికెట్లు పడగొట్టిన సైఖైన్, బ్యాటింగ్‌లో 48 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్లతో అజేయంగా 58 పరుగులు సాధించాడు. రెండో ఇన్నింగ్స్‌లో తన బౌలింగ్‌తో మరింత ప్రభావం చూపిస్తూ 20 ఓవర్లలో 55 పరుగులిచ్చి 5 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి మొత్తం 7 వికెట్లు పడగొట్టడంతో పాటు, అజేయ అర్ధశతకాన్ని నమోదు చేసి సైఖైన్ తన ఆల్‌రౌండ్ నైపుణ్యాన్ని ప్రదర్శించాడు. రెండో ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు సాధించడం, తొలి ఇన్నింగ్స్‌లో అజేయంగా 58 పరుగులు చేయడం అతని ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమర్థవంతంగా రాణిస్తూ యువ ఆల్‌రౌండర్‌గా సైఖైన్ అఫ్రాత్ తన ప్రతిభను నిరూపించుకున్నాడు. అతని ప్రదర్శన క్రికెట్ వర్గాల్లో గుర్తింపు పొందేలా ఉందని క్రీడాభిమానులు అభిప్రాయపడుతున్నారు.

ఉష్ణమండల వ్యాధుల నివారణకు ఉమ్మడి కృషి అవశ్యం: డాక్టర్ అహ్మద్

సంగారెడ్డి జిల్లా పతాన్ చేరు , వాయిస్ టుడే న్యూస్ పతాన్ చేరు : నిర్లక్ష్యం చేయబడిన ఉష్ణమండల వ్యాధులను ఎదుర్కోవాలంటే శాస్త్రవేత్తలు, విధాన రూపకర్తలు, సామాజిక పరిశోధకులు కలిసి పనిచేయాలని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, జీవశాస్త్రాల విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఫర్హాన్ అహ్మద్ స్పష్టీకరించారు. హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్ హెచ్ఎస్) యొక్క సంస్థాగత పరిశోధన కమిటీ, తన పరిశోధన సదస్సుల శ్రేణిలో భాగంగా ఎనిమిదవ సెమినార్ ను బుధవారం నిర్వహించింది. 'వేడెక్కుతున్న ప్రపంచం కోసం వ్యాక్సిన్ ల రూపకల్పన: డెంగ్యూపై పోరాటంలో విజ్ఞానం, సమానత్వం, విధానం' అనే శీర్షికన దీనిని ఏర్పాటు చేశారు. డాక్టర్ అహ్మద్, డెంగ్యూ వ్యాప్తిపై వాతావరణ మార్పులు, పర్యావరణ కారకాల ప్రభావాన్ని వివరిస్తూ, ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న డెంగ్యూ ముప్పు గురించి చర్చించారు. వ్యాక్సిన్ ఆవిష్కర్తలుగా తమ ప్రయోగశాల ఈ సమస్యను ఎలా పరిష్కరించిందో ఆయన వివరించారు. ఈ పరిశోధన ఫలితాలు ప్రాథమిక, ప్రీ-క్లినికల్ దశలో ఉన్నప్పటికీ, ఈ రంగాన్ని వెనక్కి నెట్టిన భద్రత, సమర్థతకు సంబంధించిన రాజీలను, మరింత తెలివైన వ్యాక్సిన్ రూపకల్పన ద్వారా పరిష్కరించవచ్చని ఇవి చూపిస్తున్నాయన్నారు. పలువురు అధ్యాపకులు ఈ చర్చలో చురుకుగా పాల్గొని, పలు సందేహాలపై వివరణలు కోరడంతో పాటు డాక్టర్ అహ్మద్ పరిశోధనా నైపుణ్యాన్ని, స్పష్టమైన వివరణను ప్రశంసించారు.

సంగారెడ్డి జిల్లా పతాన్ చేరు , వాయిస్ టుడే న్యూస్ పతాన్ చేరు : ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రముఖ్ నగర్ కాలనీలో ఉన్న వాటర్ సంపు వద్ద ఇస్నాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ మోటే సుమలత శ్రీకాంత్ వాటర్ లైన్‌మెన్‌లతో సమావేశం ఏర్పాటు చేశారు. భవిష్యత్తులో కాలనీలో తాగునీటి సరఫరాకు సంబంధించి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా, ప్రజలకు నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, అవసరమైన చర్యలపై వాటర్ లైన్‌మెన్‌లతో చర్చించారు. నీటి సరఫరా వ్యవస్థను నిరంతరం పర్యవేక్షిస్తూ, పైప్‌లైన్లలో సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు నిరంతరాయంగా, సక్రమంగా తాగునీరు అందేలా సంబంధిత సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆమె పేర్కొన్నారు. ప్రజలకు భవిష్యత్తులో నీటి సమస్యలు ఎదురుకాకుండా ముందస్తు చర్యలు చేపట్టడమే లక్ష్యంగా ఈ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ అధికారులు వార్డ్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఢిల్లీకి ప్రత్యేక రైళ్లు కేటాయించాలి

సికింద్రాబాద్ రైల్ నిలయం ఎదుట కాంగ్రెస్ నేతల ధర్నా..

సికింద్రాబాద్, అక్టోబర్ 28 (వాయిస్ టుడే ప్రతినిధి): ఢిల్లీలో నవంబర్ 1న నిర్వహించనున్న కాంగ్రెస్ నిరసన కార్యక్రమానికి వెళ్లేందుకు ప్రత్యేక రైళ్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ నాయకులు బుధవారం సికింద్రాబాద్ రైల్ నిలయం ఎదుట మెరుపు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం రైల్ నిలయంలోని జీఎం కార్యాలయం ఎదుట జరిగిన ఈ ఆందోళనలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు నవీన్ యాదవ్, శ్రీగణేశ్, సనత్‌నగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కోట నీలిమ, డీసీసీ అధ్యక్షులు మోత రోహిత్, దీపక్ జాన్, హైదరాబాద్ జిల్లా ఆర్టీఏ సభ్యుడు సురేష్ లాల్ తదితరులు పాల్గొన్నారు. ఢిల్లీలో జరిగే ఛలో ఢిల్లీ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లేందుకు రైల్వే శాఖ ప్రత్యేక రైళ్లను కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. రైళ్ల కేటాయింపుపై రైల్వే అధికారులు వెంటనే స్పందించాలని కోరారు. ధర్నా సందర్భంగా చోటుచేసుకున్న తోపులాటలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ కిందపడినట్లు సమాచారం. కాంగ్రెస్ నిరసన కార్యక్రమానికి రైళ్ల సదుపాయం కల్పించే విషయంలో రైల్వే అధికారులు సానుకూలంగా స్పందించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు.

మాదకద్రవ్య రహిత భారత్ కోసం
యువత కృషి చేయాలి

యువత సమష్టిగా ముందుకు రావాలి..
గవర్నర్ శివప్రతాప్ శుక్లా..
ఓయూలో 1,200 మందికి పైగా విద్యార్థులతో ప్రతిజ్ఞ, భారీ ర్యాలీ

సికింద్రాబాద్, అక్టోబర్ 28 (వాయిస్ టుడే ప్రతినిధి): మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి యువత సమష్టిగా ముందుకు రావాలని రాష్ట్ర గవర్నర్, ఉస్మానియా విశ్వవిద్యాలయ ఛాన్సలర్ శివప్రతాప్ శుక్లా పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నిర్వహించిన మాదకద్రవ్య వ్యతిరేక అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని, 1,200 మందికి పైగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లతో ప్రతిజ్ఞ చేయించారు. ఆరోగ్యవంతమైన యువతతోనే అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణం సాధ్యమవుతుందని గవర్నర్ పేర్కొన్నారు. మాదకద్రవ్యాల బారిన పడకుండా విద్యార్థులు తమ జీవిత లక్ష్యాలపై దృష్టి సారించాలని, క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యతను

అలవర్చుకోవాలని సూచించారు. మాదకద్రవ్య రహిత భారత్ లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఓయూ బిసి ప్రొఫెసర్ కుమార్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తుల ఆరోగ్యంతో పాటు విద్య, ఉద్యోగావకాశాలు, కుటుంబాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని అన్నారు. విద్యాసంస్థలు, వసతి గృహాలు, గ్రామాలు, పట్టణాల్లో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మాదకద్రవ్యాల సమస్యతో బాధపడుతున్నవారిని అవమానించకుండా, వారికి వైద్య సహాయం అందేలా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రెడ్‌క్రాస్ శాఖ అధ్యక్షుడు ఎం. దానకిశోర్ మాట్లాడుతూ దేశభక్తి, రాజ్యాంగ బాధ్యతలు, సామాజిక సేవా భావం ప్రతి పౌరుడిలో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ రెడ్‌క్రాస్ సంఘం, ఓయూ, ఎన్ఎస్ఎస్ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం గవర్నర్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఠాగూర్ ఆడిటోరియం నుంచి ఆర్ట్స్ కళాశాల వరకు సాగిన ఈ ర్యాలీలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని మాదకద్రవ్యాల వ్యతిరేక నినాదాలతో ప్రజల్లో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. నరేష్ రెడ్డి, రెడ్‌క్రాస్ రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి, సీఈఓ ప్రొఫెసర్ ఎ. శ్రీరాములు, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ చలమల్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామిక తెలంగాణ కోసం పోరాడుదాం

ఈ నెల 31న కొత్తగూడెంలో
తెలంగాణ ప్రజాఫ్రంట్ 17వ ఆవిర్భావ సభ..
సభను విజయవంతం చేయాలని పాశం యాదగిరి పిలుపు..

సికింద్రాబాద్, అక్టోబర్ 28 (వాయిస్ టుడే ప్రతినిధి): తెలంగాణ ప్రజాఫ్రంట్ 17వ ఆవిర్భావ సభను ఈ నెల 31న కొత్తగూడెంలో విజయవంతం చేయాలని సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి పిలుపునిచ్చారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రజాఫ్రంట్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కడమంచి రాంబాబు, పాశం యాదగిరి, ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి ఉద్యమ నాయకుడు ఆజాద్ ఆధ్వర్యంలో సభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాశం యాదగిరి మాట్లాడుతూ, తెలంగాణలోని అన్ని రంగాలు దళారులు, పెట్టుబడిదారుల ఆధిపత్యం కారణంగా విధ్వంసానికి గురవుతున్నాయని విమర్శించారు. రాష్ట్రంలోని వివిధ వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, తెలంగాణను ప్రజాస్వామికంగా అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపైనా ఉందని అన్నారు. ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేయడమే ఇందుకు మార్గమని, ఆ దిశగా తెలంగాణ ప్రజాఫ్రంట్ కృషి చేస్తోందని పేర్కొన్నారు. తెలంగాణ అస్తిత్వంపై మరోసారి కోస్తాంధ్ర పెట్టుబడిదారుల ఆధిపత్యం పెరుగుతోందని ఆయన విమర్శించారు. ఈ ఆధిపత్యానికి వ్యతిరేకంగా "ప్రజాస్వామిక తెలంగాణ కోసం పోరాడుదాం" అనే నినాదంతో కొత్తగూడెంలో నిర్వహించనున్న 17వ ఆవిర్భావ సభకు విద్యార్థులు, మేధావులు, కార్మికులు, రైతులు, మహిళలు, వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సందీప్, రాజేష్, రమేష్, పైడి జనార్దన్ తదితర వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఓయూ ఉద్యోగుల పెన్‌డౌన్--టూల్‌డౌన్

పెండింగ్ సమస్యలు
పరిష్కరించాలని నాన్ టీచింగ్ జేఏసీ డిమాండ్

సికింద్రాబాద్, అక్టోబర్ 28 (వాయిస్ టుడే ప్రతినిధి): ఉస్మానియా యూనివర్సిటీలో ఉద్యోగుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నాన్ టీచింగ్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన పెన్‌డౌన్--టూల్‌డౌన్ కార్యక్రమానికి ఉద్యోగుల నుంచి విశేష స్పందన లభించింది. వివిధ విభాగాలకు చెందిన సిబ్బంది నిరసనలో పాల్గొని తమ సమస్యలను పరిష్కరించాలని యూనివర్సిటీ యాజమాన్యాన్ని, రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగులకు వర్తించే నిబంధనల ప్రకారం పెన్షన్

ప్రయోజనాలు కల్పించాలని, టైమ్‌స్కేల్ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న 60 శాతం బకాయిలను విడుదల చేయాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. 2023 నుంచి నిలిచిపోయిన రిటైర్మెంట్ ప్రయోజనాలను పునరుద్ధరించాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఏప్రిల్ 2023 నుంచి పెండింగ్‌లో ఉన్న రూ. 1,500 వార్షిక ఇంక్రిమెంట్‌ను ఏరియర్స్‌తో సహా చెల్లించాలని కోరారు. దీర్ఘకాలంగా యూనివర్సిటీలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసేందుకు ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని, కోర్టు ఆదేశాల ప్రకారం వారి వివరాలను అనుబంధం 1, అనుబంధం 2 రూపంలో అక్టోబర్ 30లోగా సమర్పించాలని అధికారులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ కుమార్, అధ్యక్షుడు ఖదీర్ ఖాన్, కార్యవర్గ సభ్యులు, ఆరు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికులకు న్యాయం చేయాలి

కూనంనేని సాంబశివరావు..
యూనియన్ల గుర్తింపు వివాదాన్ని పరిష్కరించాలి..
లేదంటే రాష్ట్రవ్యాప్త సమరం

సికింద్రాబాద్, అక్టోబర్ 28 (వాయిస్ టుడే ప్రతినిధి): ఆర్టీసీ కార్మికుల హక్కులతో ఆటలాడితే సహించేది లేదని, యూనియన్ల గుర్తింపు ఎన్నికల్లో జరిగిన అక్రమాలపై విచారణ జరిపి న్యాయం చేయాలని సీపీఐ శాసనసభాపక్ష నేత కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం చిక్కడపల్లిలోని కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద ఎంప్లాయీస్ యూనియన్ కూటమి నిర్వహించిన ఆందోళనకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ, కార్మికుల ప్రజాస్వామ్య తీర్పును గౌరవించాలని, ఎన్నికల ఫలితాల్లో అవకతవకలను సరిదిద్దాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. బాబు మాట్లాడుతూ, నల్గొండ, వరంగల్, మెదక్, సికింద్రాబాద్ రీజియన్లలో గుర్తింపు ఫలితాలపై అభ్యంతరాలున్నాయని తెలిపారు. 1958 కోడ్ ఆఫ్ డిసిప్లిన్ ప్రకారం విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న మాట్లాడుతూ, రీజియన్ స్థాయి ఎన్నికల ఫలితాల్లో అక్రమాలు జరిగాయని అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఫలితాల్లో తప్పులను సరిదిద్దకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఏఐటీయూసీ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం.డి. యూసుఫ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. నరసింహతో పాటు ఇతర కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ, గుర్తింపు వివాదాన్ని వెంటనే పరిష్కరించాలని, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామన్న హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు న్యాయం జరిగే వరకు ఐక్య పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ ఆందోళనలో వివిధ కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్మిక శాఖ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ం

పాత్రికేయులు లేని సమాజం చీకటిమయం

రాష్ట్ర ఉన్నత విద్యా మండలి
వైస్ ఛైర్మన్ ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం
ఘనంగా ఐఎఫ్ డబ్ల్యూజే 76వ వ్యవస్థాపక వేడుకలు

హైదరాబాద్,అక్టోబర్ 28: మనిషికి ప్రాణవాయువు ఎంత అవసరమో, సమాజానికి జర్నలిజం, జర్నలిస్టులు కూడా అంతే కీలకమని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ ఛైర్మన్ ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం అన్నారు. సూర్యుడు లేని సమాజం ఎలా చీకటిమయమవుతుందో, జర్నలిస్టులు లేని సమాజం కూడా అదే స్థితికి చేరుకుంటుందని ఆయన పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐఎఫ్ డబ్ల్యూజే) 76వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రొఫెసర్ పురుషోత్తం మాట్లాడారు.

జర్నలిస్టుల సంక్షేమాన్ని విస్మరించడం విచారకరం

సమాజానికి దిశానిర్దేశం చేసే జర్నలిస్టులు నేడు అత్యంత దయనీయ స్థితిలో ఉన్నారని ప్రొఫెసర్ పురుషోత్తం ఆవేదన వ్యక్తం చేశారు. ఒకప్పుడు సమాజానికి, ప్రభుత్వాలకు దిశానిర్దేశం చేసే స్థాయి పత్రికలకు ఉండేదని, ప్రస్తుతం రాజకీయ నాయకులు జర్నలిస్టులను పావులుగా వాడుకుంటున్నారే తప్ప వారి సంక్షేమం గురించి పట్టించుకోవడం లేదని విమర్శించారు. విద్యా, వైద్య, మీడియా సంస్థలు పెట్టుబడిదారుల చేతుల్లోకి వెళ్లడం వల్లే విలువల పతనం ప్రారంభమైందన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, సంక్షేమ పథకాలు కరువయ్యాయని తెలిపారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కేటాయింపుపై సానుకూలంగా ఉన్నారని, ఈ విషయాన్ని స్వయంగా సీఎం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రొఫెసర్‌గా, తెలంగాణ ఉద్యమ సహచరుడిగా తనకు జర్నలిస్టులతో విడదీయరాని అనుబంధం ఉందన్నారు.

జర్నలిస్టుల హక్కులకై నిరంతర పోరాటం

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య

మాట్లాడుతూ, దేశంలో జర్నలిస్టుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న మొదటి యూనియన్ ఐఎఫ్ డబ్ల్యూజే అని అన్నారు. జర్నలిస్టుల రక్షణ కోసం ప్రత్యేక చట్టం, రిటైర్డ్ పాత్రికేయులకు జాతీయ పెన్షన్ పథకం, జాతీయ మీడియా కమిషన్ ఏర్పాటు కోసం జాతీయ స్థాయిలో పోరాటం సాగుతోందన్నారు. త్వరలోనే తెలంగాణలోని అన్ని జిల్లాల్లో సంఘాన్ని బలోపేతం చేసి జర్నలిస్టుల సమస్యలపై కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

సీనియర్ పాత్రికేయులకు ఘన సన్మానం

సమాజానికి విశిష్ట సేవలందించిన సీనియర్ పాత్రికేయులు టి. ఉదయవర్లు, నందిరాజు రాధాకృష్ణ, అద్దంకి శ్రీరామ కుమార్, సి.బి. లక్ష్మి, యర్రమిల్లి రామారావులను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ వేడుకల్లో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, నేషనల్ కౌన్సిల్ మెంబర్ కుంచం శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవికుమార్, కో-కన్వీనర్లు శ్రీనివాస్ గౌడ్, ఎం. రవికుమార్, రాష్ట్ర నాయకులు పి. ఆనందం, కె. పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

జల్సా జంక్షన్ హోటల్ ప్రారంభోత్సవ కార్యక్రమం

ఆగం పాండు ముదిరాజ్
చేతుల మీదుగా బాచుపల్లిలో ఘనంగా ప్రారంభం

కుత్బుల్లాపూర్ అక్టోబర్ 28(వాయిస్ టుడే) బాచుపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన జల్సా జంక్షన్ హోటల్ ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆగం పాండు ముదిరాజ్ తన చేతుల మీదుగా హోటల్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన హోటల్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, వినియోగదారులకు నాణ్యమైన ఆహారం, మెరుగైన సేవలు అందించి వ్యాపారంలో మంచి గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. నూతనంగా వ్యాపార రంగంలో అడుగుపెట్టడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో హోటల్ యాజమాన్యం, స్థానిక ప్రముఖులు, ఆహ్వానితులు పాల్గొన్నారు.

బీసీలకు రాజ్యాధికారమే లక్ష్యం

మున్నూరుకాపుల ఐక్యతతో బలహీన వర్గాల హక్కుల సాధన

సంఘటితంగా ముందుకు సాగుతూ

రాజకీయ ప్రాతినిధ్యం సాధించాలి: రాష్ట్ర అధ్యక్షుడు

సర్దార్ పుట్టం పురుషోత్తమరావు పటేల్

ఖమ్మం, అక్టోబరు 28:వాయిస్ టుడే : మున్నూరుకాపులంతా ఐక్యంగా, సంఘటితంగా ముందుకు సాగుతూ ఇతర బలహీన వర్గాలను కలుపుకొని రాజ్యాధికారం దిశగా ప్రయాణం సాగించాలని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ పుట్టం పురుషోత్తమరావు పటేల్ పిలుపునిచ్చారు. సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా బీసీలు ఎదుర్కొంటున్న అన్యాయాలను ఎదుర్కోవాలంటే ఐక్యతే ప్రధాన ఆయుధమని స్పష్టం చేశారు. ఖమ్మంలోని మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహంలో బుధవారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ, జిల్లా అనుబంధ సంఘాల విస్తృత సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఎన్నికల సమయంలో బీసీల మద్దతు కోరే రాజకీయ పార్టీలు అధికార పంపిణీ, నిర్ణయాధికారంలో మాత్రం తగిన ప్రాతినిధ్యం కల్పించడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో సుమారు 60 శాతం ఉన్న బీసీలకు జనాభా ప్రాతిపదికన రాజకీయ, సామాజిక ప్రాతినిధ్యం దక్కాలని డిమాండ్ చేశారు. మున్నూరుకాపుల జనాభా వాటాను తక్కువగా చూపించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. రాష్ట్ర మంత్రివర్గంలో మున్నూరుకాపులకు అవకాశం కల్పించకపోవడం తమ సామాజిక వర్గానికి జరిగిన అన్యాయంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ఓట్లు మావి.. ఎన్నికల కష్టాలు మావి.. కానీ అధికారంలో వాటా మాత్రం ఎందుకు దక్కడం లేదని ప్రశ్నించారు. బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా చూసే రాజకీయాలకు స్వస్తి పలకాలని హితవు పలికారు. రాజ్యాధికారం అంటే కేవలం పదవులు పొందడం మాత్రమే కాదని, ప్రభుత్వ విధానాల రూపకల్పనలో తమ గొంతుక వినిపించడం, విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో తగిన వాటా సాధించడం, బలహీన వర్గాలకు సామాజిక న్యాయం అందేలా పోరాడటమేనని వివరించారు. మున్నూరుకాపులు వ్యక్తిగత విభేదాలను పక్కనపెట్టి సంఘం బలోపేతానికి కృషి చేయాలని కోరారు.

ఖమ్మం
మేయర్ పదవి బీసీలకే ఇవ్వాలి

సమావేశంలో పలు కీలక తీర్మానాలు చేశారు. రానున్న ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో మేయర్ పదవిని బీసీలకు కేటాయించాలని, మెజారిటీ డివిజన్లలో బీసీలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా, మండల, గ్రామీణ స్థాయిలో సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు. యువత, మహిళలు, విద్యార్థులను సంఘ కార్యకలాపాల్లో భాగస్వాములను చేయాలని, బీసీ సంఘాల మధ్య సమన్వయం పెంచి హక్కుల సాధనకు ఉమ్మడి ఉద్యమాలు నిర్వహించాలని తీర్మానించారు. ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేసేలా కార్యాచరణ చేపట్టాలని నిర్ణయించారు. రాష్ట్రంలోని అన్ని బీసీ సంఘాలతో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి ఉమ్మడి సమస్యలపై పోరాటం చేయాలని తీర్మానించారు. అలాగే నవంబర్ 15న ఖమ్మంలోని చెరుకూరి మామిడి తోటలో నిర్వహించనున్న మున్నూరుకాపు జిల్లా వన మహా సమారాధనను విజయవంతం చేయాలని సమావేశం పిలుపునిచ్చింది.

ప్రముఖ నాయకుల హాజరు

జిల్లా గౌరవ అధ్యక్షుడు కొత్త సీతారాములు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా ఇన్‌చార్జి ఆవుల రామారావు పటేల్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ, పందిరి వేణు పటేల్, రాష్ట్ర కోశాధికారి కంచి సత్యనారాయణ పటేల్, రాష్ట్ర కార్యదర్శి దేవళ్ల అరుణ్ పటేల్, నల్గొండ జిల్లా అధ్యక్షుడు వాసుదేవుల వెంకట నర్సయ్య పటేల్, ప్రధాన కార్యదర్శి నేతి వెంకటేశ్వర్లు పటేల్ అతిథులుగా హాజరయ్యారు. జిల్లా అధ్యక్షుడు శీలంశెట్టి వీరభద్రం, ప్రధాన కార్యదర్శి పసుపులేటి దేవేందర్, కోశాధికారి మాదూరి పూర్ణచందర్, మహిళా విభాగం అధ్యక్షురాలు పగడాల మంజుల, యువజన అధ్యక్షుడు తోట రమేష్, పట్టణ అధ్యక్షుడు పార ఉదయ్ కుమార్, పట్టణ మహిళా అధ్యక్షురాలు కొలనుపాక రమాదేవి, పార నాగేశ్వరరావు, పొదిలి రవికుమార్, మేకల భిక్షమయ్య, పసుపులేటి నాసరయ్య, మధిర నియోజకవర్గ అధ్యక్షుడు ఆళ్ల కృష్ణ, పాలేరు నియోజకవర్గ అధ్యక్షుడు మరిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. మున్నూరుకాపుల ఐక్యతతో పాటు అన్ని బలహీన వర్గాలను కలుపుకొని సామాజిక న్యాయం, రాజకీయ ప్రాతినిధ్యం, రాజ్యాధికార సాధన దిశగా సంఘం ఉద్యమాన్ని మరింత విస్తరించాలని సమావేశం ఆకాంక్షించింది.

డిజిటల్ జనగణనలో ఓబీసీలకు ప్రత్యేక గుర్తింపు ఏదీ?

రాజ్యాంగ సవరణలపై ఉన్న శ్రద్ధ ఓబీసీ జనాభా గణనపై ఏదీ?

అఖిలపక్ష సమావేశంలో

జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి డిమాండ్

హైదరాబాద్, అక్టోబర్ 28: దేశంలో ఓబీసీల కచ్చితమైన జనాభా ఎంత ఉందో తెలియకుండా సామాజిక న్యాయం ఎలా సాధ్యమవుతుందని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు, బీసీ రిజర్వేషన్ల సాధన సమన్వయ జేఏసీ చైర్మన్ దుండ్ర కుమారస్వామి ప్రశ్నించారు. ఆర్థికంగా బలహీన వర్గాలకు (ఈడబ్ల్యూఎస్) 10 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు రాజ్యాంగ సవరణ చేపట్టిన కేంద్ర ప్రభుత్వం, బీసీలకు వారి జనాభా ప్రాతిపదికన న్యాయం చేసేందుకు ఎందుకు చొరవ చూపడం లేదని ఆయన నిలదీశారు. ఇటీవల నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో దుండ్ర కుమారస్వామి మాట్లాడుతూ.. రాబోయే డిజిటల్ జనగణనలో ఓబీసీ కులాల నమోదు కోసం ప్రత్యేక 'డ్రాప్‌డౌన్ మెనూ' ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై సుప్రీంకోర్టును మరియు సంబంధిత అధికారులను ఆశ్రయించే అవకాశం ఉన్న నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పష్టమైన విధాన నిర్ణయాన్ని ప్రకటించాలని కోరారు.

కులాంతర సమాచారంతోనే సమగ్ర అభివృద్ధి

జనగణనలో ఓబీసీ కులాల వారీ వివరాలు సేకరిస్తేనే వారి వాస్తవ జనాభా, విద్యా–ఉద్యోగ ప్రాతినిధ్యం, సామాజిక పరిస్థితులపై స్పష్టత వస్తుందని కుమారస్వామి తెలిపారు. ఈ గణాంకాల ఆధారంగానే రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలు, రాజకీయ ప్రాతినిధ్యంపై సరైన నిర్ణయాలు తీసుకోవడానికి వీలవుతుందని చెప్పారు. డ్రాప్‌డౌన్ మెనూ ద్వారా కులాల పేర్లు నమోదు చేయడం వల్ల ఏకరూపత వచ్చి, గణాంకాల విశ్వసనీయత పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. దీనిని కేవలం సాంకేతిక లేదా పరిపాలనాపరమైన అంశంగా చూడకుండా, కోట్లాది మంది వెనుకబడిన వర్గాల హక్కుల సమస్యగా పరిగణించాలని కేంద్రాన్ని కోరారు.

సామాజిక న్యాయానికి కార్యాచరణ ప్రకటించాలి

రాజ్యాంగం అందరికీ సమానత్వం, సామాజిక న్యాయం అందిస్తుందని, అందుకే ఓబీసీల జనాభా గణన విషయంలో కేంద్ర ప్రభుత్వం, సంబంధిత సంస్థలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఉన్నత న్యాయస్థానం కూడా బీసీ వర్గాల హక్కులను బలోపేతం చేసేలా స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. డిజిటల్ జనగణనలో ఓబీసీలకు తగిన గుర్తింపు కల్పించడం ద్వారానే భవిష్యత్తులో విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో న్యాయమైన ప్రాతినిధ్యానికి బలమైన పునాది పడుతుందని, కేంద్ర ప్రభుత్వం తక్షణమే దీనిపై స్పష్టత ఇచ్చి సామాజిక న్యాయ దిశగా కార్యాచరణ ప్రకటించాలని ఆయన స్పష్టం చేశారు.

పట్టభద్రుల గొంతుకగా శాసనమండలిలో బలమైన ప్రాతినిధ్యమే లక్ష్యం

విద్యావంతుల ఆకాంక్షలు..

నిరుద్యోగుల ఆశలు.. హక్కుల పరిరక్షణే ఎజెండా

కాకతీయ యూనివర్సిటీలో టిఆర్ఎస్ గ్రేటర్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వెంకటేశ్వర్ రావు

ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం

హనుమకొండ, అక్టోబర్ 28: పట్టభద్రుల సమస్యలకు పరిష్కారం చూపుతూ, నిరుద్యోగ యువత ఆకాంక్షలను శాసనమండలిలో బలంగా వినిపించడమే లక్ష్యంగా తెలంగాణ రక్షణ సేన వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా పార్టీ అభ్యర్థి డా. నలమాస శ్రీకాంత్ గౌడ్ బుధవారం కాకతీయ యూనివర్సిటీలో పట్టభద్రులను నేరుగా కలుసుకుని ప్రచారం నిర్వహించారు. విద్యావంతుల సమస్యలు, ఉద్యోగ అవకాశాలు, విద్యారంగంలో నెలకొన్న సవాళ్లు, అర్హులైన యువతకు న్యాయం వంటి అంశాలను ప్రధానంగా ప్రస్తావిస్తూ ఓటర్ల మద్దతు కూడగట్టే ప్రయత్నం చేశారు. యూనివర్సిటీకి విచ్చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు సయ్యద్ ఇస్మాయిల్, పార్టీ అభ్యర్థి నలమాస శ్రీకాంత్ గౌడ్‌లకు తెలంగాణ రక్షణ సేన గ్రేటర్ వరంగల్ అధ్యక్షుడు లయన్ డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు ఘన స్వాగతం పలికారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి యూనివర్సిటీ ప్రాంగణంలో పట్టభద్రులను కలుసుకుంటూ ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించారు.

పట్టభద్రుల సమస్యలే ప్రధాన అజెండా

ఉన్నత విద్యను అభ్యసించిన యువతకు అర్హతకు తగిన ఉద్యోగ అవకాశాలు కల్పించడం, నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించడం, ప్రభుత్వ ఉద్యోగ నియామక ప్రక్రియపై యువతలో ఉన్న ఆశలకు తగిన ప్రాధాన్యత కల్పించడం వంటి అంశాలు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కీలకంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో పట్టభద్రుల సమస్యలపై నిరంతరం స్పందిస్తూ, వారి అభిప్రాయాలను శాసనమండలి దృష్టికి తీసుకెళ్లగల నాయకత్వం అవసరమనే అంశాన్ని తెలంగాణ రక్షణ సేన నాయకులు ప్రచారంలో వివరించారు. ఎమ్మెల్సీ పదవి కేవలం ఒక రాజకీయ హోదా మాత్రమే కాదని, విద్యావంతుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారం కోసం చొరవ చూపాల్సిన బాధ్యతతో కూడిన ప్రాతినిధ్యమని పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతకు భరోసా కల్పించడం, విద్యారంగ సమస్యలపై చర్చకు వేదిక కల్పించడం, పట్టభద్రుల హక్కులను పరిరక్షించడం వంటి అంశాలపై అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని కోరారు.

విద్యా కేంద్రం నుంచే ప్రచారానికి నాంది

విద్యార్థులు, పరిశోధకులు, ఉద్యోగార్థులు, వివిధ రంగాల్లో పనిచేస్తున్న పట్టభద్రులతో మమేకమయ్యేందుకు కాకతీయ యూనివర్సిటీని ప్రచార వేదికగా ఎంచుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. పట్టభద్రులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడంతోపాటు, తమ సమస్యలను అర్థం చేసుకుని వాటి పరిష్కారానికి కృషి చేసే అభ్యర్థిని ఎంపిక చేసుకోవాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. పట్టభద్రుల ఆకాంక్షలకు అనుగుణంగా ఎన్నికల ప్రచారాన్ని ముందుకు తీసుకెళ్లడం, యువతతో ప్రత్యక్ష సంబంధాలను బలోపేతం చేసుకోవడం, విద్యావంతుల సమస్యలను విస్తృతంగా చర్చలోకి తీసుకురావడంపై తెలంగాణ రక్షణ సేన దృష్టి సారించింది. కాకతీయ యూనివర్సిటీలో ప్రారంభమైన ప్రచారం ద్వారా రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ అభ్యర్థికి మద్దతు కూడగట్టేందుకు పార్టీ శ్రేణులు కార్యాచరణ చేపట్టాయి. ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర, జిల్లా నాయకులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కల్వకుంట్ల వంశీధర్‌రావును కలిసిన బిఆర్ఎస్ నేతలు

నాచారం (వాయిస్ టుడే):సికింద్రాబాద్ నియోజకవర్గం తార్నాక డివిజన్ కు చెందిన పలువురు బి ఆర్ ఎస్ నాయకులు బిఆర్ఎస్ మహారాష్ట్ర ఇన్చార్జ్ కల్వకుంట్ల వంశీధర్రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు సిద్దిపేటలో వంశీధరావు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీ వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు వెళ్లి జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వంశీధరావును పూలమాలతో, శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చింత లక్ష్మణ్, పరుశరాములు, వరికుప్పల శ్యామ్, మనోహర్ తదితరులున్నారు.

శబ్ద కాలుష్య వాహనాలపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలి

పోలీసులకు పర్యావరణ పరిరక్షణ

అభివృద్ధి మండలి అధ్యక్షుడు రంగయ్య బహిరంగ లేఖ

హైదరాబాద్, అక్టోబర్ 28: భారీ శబ్దాలు చేస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని పర్యావరణ పరిరక్షణ అభివృద్ధి మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్సీహెచ్ రంగయ్య పోలీసు అధికారులను డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన పోలీసు విభాగానికి ఒక బహిరంగ లేఖ రాశారు. సమాజంలో అక్రమ శబ్ద నిరోధకాలతో (సైలెన్సర్లతో) తిరిగే ద్విచక్ర వాహనదారులను అరికట్టేందుకు ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని కోరారు. శబ్ద కాలుష్యం పర్యావరణ పరిరక్షణకు తీవ్ర విఘాతమని, ముఖ్యంగా వృద్ధులు, అనారోగ్య బాధితులు మరియు చిన్నపిల్లలకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తోందని రంగయ్య పేర్కొన్నారు. ఈ ప్రత్యేక తనిఖీల్లో భాగంగా ప్రతిరోజూ చేపట్టిన చర్యలపై ప్రజలకు విస్తృతంగా ప్రచారం కల్పించాలని పోలీసులకు సూచించారు. అలా చేయడం వల్ల వాహనదారుల్లో బాధ్యత పెరిగి, శబ్ద కాలుష్యాన్ని సమర్థవంతంగా అరికట్టవచ్చని ఆయన స్పష్టం చేశారు.

ఎంపీ వద్దిరాజును సత్కరించిన మున్నూరుకాపు ప్రముఖులు

బురహాన్‌పురంలోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వక భేటీ

ఖమ్మం, అక్టోబరు 28: బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రను మున్నూరుకాపు సంఘం రాష్ట్ర, జిల్లా స్థాయి ప్రముఖులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ పుట్టం పురుషోత్తమరావు, కోశాధికారి కంచి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు పందిరి వేణు, కార్యదర్శి దేవుళ్ల అరుణ్, నల్లగొండ జిల్లా అధ్యక్షుడు వాసుదేవుల వెంకట నర్సయ్య, ప్రధాన కార్యదర్శి నేతి వెంకటేశ్వర్లు బుధవారం ఖమ్మంలో జరిగిన సంఘం జిల్లా శాఖ విస్తృత కార్యవర్గ సమావేశానికి హాజరయ్యారు. అనంతరం బురహాన్‌పురంలోని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర క్యాంపు కార్యాలయానికి చేరుకుని ఆయనను కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా పరస్పరం ఆత్మీయంగా మాట్లాడుకున్నారు.

తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన కరవు మండలాలపై బండి సంజయ్ విమర్శలు

తెలంగాణ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన కరవు మండలాల జాబితాపై కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ జాబితా అత్యంత అశాస్త్రీయంగా, పక్షపాత ధోరణితో ఉందని ఆయన ఆరోపించారు. కేవలం మొక్కుబడిగా ఈ జాబితాను తయారు చేశారని మండిపడ్డారు. ముఖ్యంగా కరీంనగర్ పార్లమెంటరీ నియోజకవర్గానికి ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని బండి సంజయ్ అన్నారు. 35 శాతం వర్షపాతం లోటు ఉన్న మండలాలను కూడా జాబితాలో చేర్చకపోవడం ప్రభుత్వ ఉద్దేశాన్ని స్పష్టం చేస్తోందన్నారు. హుస్నాబాద్, వేములవాడ, సిరిసిల్ల, మానకొండూరు, చొప్పదండి, హుజూరాబాద్ నియోజకవర్గాల్లోని తీవ్ర కరవు పరిస్థితులు ప్రభుత్వానికి కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. పంట పొలాలు బీళ్లుగా మారినా, ప్రజలు తాగునీటి ఎద్దడితో అల్లాడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. నష్టపరిహారం ఖర్చులు తప్పించుకోవాలనే ఉద్దేశంతోనే కరీంనగర్‌ను ఉద్దేశపూర్వకంగా విస్మరించారా? అని ఆయన నిలదీశారు. క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి రైతులతో మాట్లాడితేనే కరవు తీవ్రత స్పష్టంగా తెలుస్తుందని సూచించారు. కరవు మండలాలను ఏ ప్రాతిపదికన, ఏ గణాంకాల ఆధారంగా గుర్తించారో తెలుపుతూ ప్రభుత్వం తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతి మండలానికి వర్షపాతం లోటు, సాగు విస్తీర్ణం, పంట నష్టం, భూమిలో తేమ వంటి అంశాలను విడివిడిగా పరిశీలించి, అర్హులైన అన్ని మండలాలను జాబితాలో చేర్చాలని కోరారు. ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాలను పక్కనపెట్టి, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని హితవు పలికారు. లేనిపక్షంలో రైతుల పక్షాన పోరాటాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

నల్గొండలో జనసేన పార్టీ జిల్లా సమీక్ష సమావేశం

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై నాయకులకు దిశానిర్దేశం చేసిన డాక్టర్ గడల శ్రీనివాసరావు

నల్గొండ: వాయిస్ టుడే : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి జనసేన పార్టీ నల్గొండ జిల్లా సమీక్ష సమావేశం హోటల్ విస్టా గ్రాండ్‌లో రాష్ట్ర జాయినింగ్ కమిటీ కన్వీనర్ ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి జనసేన పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఖమ్మం--వరంగల్--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ గడల శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ గడల శ్రీనివాసరావు మాట్లాడుతూ, నల్గొండ జిల్లాలో జనసేన పార్టీకి బలమైన పునాది ఉందని, రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో జిల్లా కీలక పాత్ర పోషించనుందని పేర్కొన్నారు. పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు, ఎన్నికల ప్రచారాన్ని సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని పార్టీ నాయకులు, వీర మహిళలు, జనసైనికులకు సూచించారు. ప్రతి నియోజకవర్గంలో క్షేత్రస్థాయిలో చురుగ్గా పనిచేస్తూ, అర్హులైన పట్టభద్రులకు ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేస్తూ ఎన్నికల కార్యక్రమాలను సమన్వయంతో నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర జాయినింగ్ కమిటీ సభ్యుడు ప్రజిత్ గౌడ్, రాష్ట్ర అధికార ప్రతినిధులు మిరియాల రామకృష్ణ, సాంబశివుడు, రాష్ట్ర నాయకులు వంగ లక్ష్మణ్ గౌడ్, కార్తీక్‌తో పాటు మునుగోడు, నకిరేకల్, మిర్యాలగూడ,

నల్గొండ, దేవరకొండ, నాగార్జునసాగర్ నియోజకవర్గాలకు చెందిన నాయకులు, జిల్లా నాయకులు, వీర మహిళలు, జనసైనికులు పాల్గొన్నారు.

ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ సేవాదళ్ రక్తదాన శిబిరం

ప్రాణాలను కాపాడటమే ఇందిరమ్మకు నిజమైన నివాళి ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా రక్తదానానికి ముందుకు రావాలి: మిద్దెల జితేందర్

హైదరాబాద్, అక్టోబరు 28: వాయిస్ టుడే : మాజీ ప్రధాని, ఉక్కు మహిళ ఇందిరా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ ఆధ్వర్యంలో గాంధీ భవన్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. అక్టోబరు 31న జరగనున్న ఇందిరా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని టీపీసీసీ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ నేతృత్వంలో బుధవారం ఈ కార్యక్రమం చేపట్టారు. 'ఓట్ బచావో -- దేశ్ బచావో' కార్యక్రమానికి సంబంధించిన ఏఐసీసీ తెలంగాణ పరిశీలకుడు మోహన్ కుమార్ మంగళం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన పెంపొందించుకుని, స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మిద్దెల జితేందర్ మాట్లాడుతూ ఇందిరా గాంధీ దేశ ఐక్యత, సమగ్రత, ప్రజాసేవ కోసం చేసిన త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు. ఆమె ఆశయాలను కొనసాగిస్తూ ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహించడమే కాంగ్రెస్ సేవాదళ్ లక్ష్యమని స్పష్టం చేశారు. రక్తదానం కేవలం ఒక సేవా కార్యక్రమం కాదని, ఒకరి ప్రాణాలను కాపాడే మహత్తరమైన మానవతా సేవ అని పేర్కొన్నారు. మనం ఇచ్చే రక్తం మరో కుటుంబంలో ఆశలు నింపగలదని, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా రక్తదానానికి ముందుకు రావాలని కోరారు. ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించడంతో పాటు, ప్రజల ప్రాణాలను కాపాడే రక్తదాన శిబిరం నిర్వహించడం ద్వారా ఆమెకు నిజమైన నివాళులర్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ తెలంగాణ పరిశీలకుడు మోహన్ కుమార్ మంగళం, టీపీసీసీ నాయకులు, ఉపాధ్యాయులు, కుమార్ రావు, యూసుఫ్ అఫ్సర్ తదితరులతో పాటు కాంగ్రెస్ సేవాదళ్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. 'ఇందిరా గాంధీ ఆశయాలే మా స్ఫూర్తి.. ప్రజాసేవే మా ధ్యేయం.. మానవతా సేవే మా మార్గం' అని మిద్దెల జితేందర్ పేర్కొన్నారు.

మున్నూరుకాపుల జనాభా తగ్గింపుపై కుట్ర!

అవమానాన్ని సహించం.. సభ్యత్వ నమోదుతో మా బలం నిరూపిస్తాం జనాభా ప్రాతిపదికన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలి: రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్

నల్గొండ, అక్టోబరు 28: వాయిస్ టుడే : మున్నూరుకాపుల జనాభా లెక్కల్లో కోత విధిస్తూ రాజకీయంగా తమ ప్రాతినిధ్యాన్ని తగ్గించే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలంగాణ మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జనాభా విషయంలో జరుగుతున్న అన్యాయాన్ని సహించబోమని, రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న సభ్యత్వ నమోదు ద్వారా తమ సామాజిక వర్గ బలాన్ని నిరూపిస్తామని స్పష్టం చేశారు. బుధవారం నల్గొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన మున్నూరుకాపు సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సైదయ్య పటేల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జిల్లపల్లి వెంకటేశ్వర్లు సభ్యత్వ నమోదు క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సుమారు 45 లక్షలుగా ఉన్న మున్నూరుకాపుల జనాభాను 28 లక్షలకు తగ్గించారని ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా తమ జనాభా ప్రాతినిధ్యాన్ని తగ్గించి చూపిస్తోందని విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న హామీపై నమ్మకంతో కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చామని, అయితే ఆచరణలో మున్నూరుకాపులకు తగిన రాజకీయ, సామాజిక ప్రాతినిధ్యం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జనాభా నిష్పత్తి ప్రకారం విద్య, ఉద్యోగాలు, రాజకీయ రంగాల్లో అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో బీసీల మద్దతు కోరే రాజకీయ పార్టీలు, అధికార పంపిణీ విషయంలోనూ అదే చిత్తశుద్ధి చూపాలని హితవు పలికారు.

సభ్యత్వ నమోదుతో రాజకీయ పార్టీలకు బలప్రదర్శన

రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్ నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపడుతున్నట్లు ప్రధాన కార్యదర్శి జిల్లపల్లి వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రతి మున్నూరుకాపు కుటుంబం సంఘంలో సభ్యత్వం తీసుకోవాలని కోరారు. www.munnurukapusangam.org వెబ్‌సైట్‌తో పాటు క్యూఆర్ కోడ్ ద్వారా సులభంగా సభ్యత్వం పొందవచ్చని వివరించారు. సంఘటిత శక్తి ద్వారానే సామాజిక హక్కులను సాధించగలమని, సభ్యత్వ నమోదు ద్వారా తమ వాస్తవ బలాన్ని రాజకీయ పార్టీలకు, ప్రభుత్వానికి తెలియజేయాలన్నారు. కేవలం జనాభా లెక్కల్లో సంఖ్య పెంచుకోవడం మాత్రమే కాకుండా, విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో మున్నూరుకాపుల వాటాను సాధించడమే సంఘం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు కమిటీలు

సంఘాన్ని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో కమిటీల ఏర్పాటు చేపట్టినట్లు నాయకులు వెల్లడించారు. తొలుత ఐదుగురితో తాత్కాలిక కమిటీలను ఏర్పాటు చేసి, అనంతరం పూర్తిస్థాయి కార్యవర్గాలను ప్రకటించనున్నట్లు తెలిపారు. యువతకు బాధ్యతలు అప్పగిస్తూ, అనుభవజ్ఞులైన పెద్దల సలహాలు, సూచనలతో సంఘాన్ని ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో సుమారు 4 నుంచి 5 లక్షల మంది, సూర్యాపేట జిల్లాలో దాదాపు 2 లక్షల మంది మున్నూరుకాపులు ఉన్నారని నాయకులు తెలిపారు. ఈ జనాభా బలాన్ని ఐక్యతగా మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బీసీ, మైనార్టీ సంఘాలు పరస్పర సమన్వయంతో పనిచేసినప్పుడే సామాజిక న్యాయం, హక్కుల సాధన సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

జిల్లా కమిటీ సభ్యుల ఎంపిక

ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యులుగా సంకురి వెంకటనారాయణ, రాళ్లపల్లి ప్రసన్నకుమార్, వాసంశెట్టి సైదులు, గాజుల శ్రీనివాస్, కుప్పగిరి వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంకూరి అనంత రాములు, తొట్ల నాగేశ్వరరావు, దాసరియాల లింగయ్య నాయుడు, సాలాదిగిరి, గుంటూల అమరయ్య, వాసంశెట్టి సైదులు తదితర మున్నూరుకాపు సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హిందుస్థాన్ యూనిలీవర్ లాభాల్లో వృద్ధి

డిమాండ్ పెరుగుదలతో మెరుగైన ఫలితాలు

ముడిసరుకు వ్యయాలపై కంపెనీ దృష్టి

భారత వినియోగ వస్తువుల మార్కెట్‌లో ప్రముఖ సంస్థ అయిన హిందుస్థాన్ యూనిలీవర్ రెండో త్రైమాసికంలో మెరుగైన పనితీరును నమోదు చేసింది. 2026 అక్టోబర్ 28న వెలువడిన నివేదిక ప్రకారం, సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో సంస్థ నికర లాభం గత ఏడాదితో పోలిస్తే 6 శాతం పెరిగి రూ.2,844 కోట్లకు చేరింది. ఉత్పత్తుల అమ్మకాలు 15 శాతం పెరిగి రూ.17,399 కోట్లకు చేరగా, అమ్మకాల పరిమాణం 7 శాతం పెరిగింది. =వబ్‌వతీం

రోజువారీ వినియోగ వస్తువులకు డిమాండ్

సబ్బులు, షాంపూలు, టూత్‌పేస్టులు, డిటర్జెంట్లు, ఆహార ఉత్పత్తులు వంటి నిత్యావసర వస్తువులకు భారత మార్కెట్‌లో నిరంతర డిమాండ్ ఉంటుంది. పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ పంపిణీ వ్యవస్థను విస్తరించడం కంపెనీలకు కీలకం. వినియోగదారులు ధర, నాణ్యత, పరిమాణం ఆధారంగా ఉత్పత్తులను ఎంచుకుంటున్నారు.

పెరుగుతున్న ఆదాయంతో కొంతమంది వినియోగదారులు అధిక ధర కలిగిన ఉత్పత్తులకు మారుతుండగా, మరికొందరు తక్కువ ధరలో లభించే ప్రత్యామ్నాయాలను కోరుకుంటున్నారు. అందువల్ల కంపెనీలు విభిన్న ధరల శ్రేణుల్లో ఉత్పత్తులను అందించాల్సి వస్తోంది.

ముడిసరుకు ధరల ప్రభావం

అమ్మకాలు పెరిగినా లాభాలను నిలబెట్టుకోవడం సవాలుగా మారవచ్చు. చక్కెర, వంటనూనెలు, పెట్రోలియం ఆధారిత ముడిసరుకుల ధరలు పెరిగితే తయారీ వ్యయాలు అధికమవుతాయి. రవాణా, ప్యాకేజింగ్ ఖర్చులు కూడా కంపెనీల లాభాలపై ప్రభావం చూపుతాయి.

ఇలాంటి పరిస్థితుల్లో ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం, సరఫరా వ్యవస్థను మెరుగుపరచడం, అనవసర వ్యయాలను తగ్గించడం ద్వారా సంస్థలు లాభాలను కాపాడుకునేందుకు ప్రయత్నిస్తాయి. ధరల పెంపు చేపట్టినప్పుడు వినియోగదారుల స్పందనను కూడా అంచనా వేయాల్సి ఉంటుంది.

ముందున్న అవకాశాలు

భారత వినియోగ మార్కెట్ విస్తరణకు జనాభా, పట్టణీకరణ, ఆదాయాల్లో మార్పులు కీలకమైన అంశాలు. అయితే పోటీ సంస్థల నుంచి ఎదురయ్యే సవాళ్లు, వినియోగదారుల కొనుగోలు శక్తి, ముడిసరుకు ధరల మార్పులు భవిష్యత్తు ఫలితాలను నిర్ణయిస్తాయి.

టాటా క్యాపిటల్ లాభాల్లో 51 శాతం వృద్ధి

రుణ వ్యాపార విస్తరణతో మెరుగైన పనితీరు

ఆర్థిక సేవల రంగంలో ఉన్న టాటా క్యాపిటల్ 2026--27 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో మెరుగైన ఫలితాలను ప్రకటించింది. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో ఏకీకృత నికర లాభం 51.3 శాతం పెరిగి రూ.1,659.9 కోట్లకు చేరగా, ఆదాయం 20.7 శాతం వృద్ధితో రూ.9,341.8 కోట్లకు చేరింది. సంస్థ రుణాల పోర్ట్‌ఫోలియో రూ.3 లక్షల కోట్లను దాటినట్లు వ్యాపార నివేదికలు తెలిపాయి. ఃష్ట్రవ ఖీఱఅఖుఅఎఖుశ్రీ జుఞజూతీవంం ం1

రుణాల అవసరం ఎందుకు పెరుగుతోంది?

వ్యక్తిగత అవసరాలు, గృహ కొనుగోలు, వాహనాలు, చిన్న వ్యాపారాల విస్తరణ, పరికరాల కొనుగోలు కోసం ప్రజలు రుణాలను ఆశ్రయిస్తున్నారు. బ్యాంకులతో పాటు బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు కూడా ఈ అవసరాలను తీర్చడంలో పాత్ర పోషిస్తున్నాయి. రుణాలను త్వరగా మంజూరు చేయడం, డిజిటల్ దరఖాస్తు విధానాలు, విభిన్న రుణ ఉత్పత్తులు వినియోగదారులకు సౌలభ్యాన్ని కల్పిస్తాయి. అయితే రుణాల లభ్యత పెరిగినప్పుడు తిరిగి చెల్లించే సామర్థ్యాన్ని అంచనా వేయడం కూడా ముఖ్యం.

సంస్థలకు ప్రధాన సవాళ్లు

ఆర్థిక సంస్థలు తమ రుణాల కోసం నిధులను సమీకరించాలి. వాటి ఖర్చు పెరిగితే లాభాలపై ప్రభావం పడుతుంది. రుణాలు తిరిగి వసూలు కాకపోతే నష్టాలు పెరిగే ప్రమాదం ఉంటుంది. అందువల్ల రుణగ్రహీతల అర్హత, బకాయిల నిర్వహణ, నిధుల సమీకరణ వ్యయం కీలక అంశాలు. రుణాల పోర్ట్‌ఫోలియో పెరుగుదల ఒక్కటే విజయానికి సూచిక కాదు. ఆస్తుల నాణ్యత, వసూళ్లు, మూలధన స్థాయి, నగదు ప్రవాహం కూడా పరిశీలించాలి.

చిన్న ఇంటినే అందమైన ప్రదేశంగా మార్చే సులభమైన అలంకరణ చిట్కాలు

ఇంట్లో ఎక్కువ వస్తువులు పేరుకుపోయినప్పుడు గది చిన్నదిగా కనిపించవచ్చు. అవసరం లేని వస్తువులను వేరు చేసి, తరచుగా ఉపయోగించే వాటిని సులభంగా అందుకునే ప్రదేశాల్లో ఉంచాలి. ప్రతి వస్తువుకు ఒక స్థానం నిర్ణయించుకోవడం ద్వారా ఇంటిని శుభ్రంగా ఉంచడం సులభమవుతుంది. పుస్తకాలు, బొమ్మలు, పత్రాలు, వంటగది సామగ్రికి వేర్వేరు నిల్వ ప్రదేశాలు ఏర్పాటు చేసుకోవచ్చు. చిన్న బుట్టలు, పెట్టెలు, గోడకు అమర్చే అరలు ఉపయోగపడతాయి. అయితే నిల్వ కోసం మరిన్ని పెట్టెలు కొనుగోలు చేసే ముందు నిజంగా అవసరమా అని ఆలోచించాలి. అవసరానికి మించిన వస్తువులను నిల్వ చేయడం వల్ల సమస్య పరిష్కారం కాకపోవచ్చు.

రంగులు, వెలుతురు గదిని మార్చగలవు

తెలుపు, క్రీమ్, లేత బూడిద వంటి రంగులు గదికి ప్రశాంతమైన రూపాన్ని ఇవ్వవచ్చు. ఒక గోడకు భిన్నమైన రంగు వేయడం లేదా రంగుల కుషన్లు, తెరలు ఉపయోగించడం ద్వారా ప్రత్యేక ఆకర్షణను సృష్టించవచ్చు. గదిలోకి సహజ కాంతి వచ్చేలా తెరలను అమర్చడం మంచిది. కిటికీలను పూర్తిగా మూసివేయకుండా, అవసరమైనప్పుడు వెలుతురు లోపలికి వచ్చేలా చూసుకోవాలి.

మొక్కలతో సహజమైన అందం

ఇంట్లో సరైన వెలుతురు లభించే ప్రదేశాల్లో చిన్న మొక్కలను పెంచుకోవచ్చు. బాల్కనీ, కిటికీ దగ్గర లేదా వెలుతురు వచ్చే మూలల్లో మొక్కలను ఉంచడం ద్వారా ఇంటికి సహజమైన అందం వస్తుంది.

చిన్న గదుల్లో ఫర్నిచర్ ఎంపిక

చిన్న ఇంట్లో భారీ ఫర్నిచర్ గది కదలికకు ఆటంకం కలిగించవచ్చు. అందుబాటులో ఉన్న స్థలానికి సరిపోయే ఫర్నిచర్ ఎంచుకోవాలి. నిల్వ సదుపాయం ఉన్న మంచాలు లేదా మడతపెట్టగల పట్టికలు కొన్ని ఇళ్లలో ఉపయోగపడతాయి. ఫర్నిచర్ కొనుగోలు చేసే ముందు గది కొలతలు తీసుకోవాలి. తలుపులు పూర్తిగా తెరుచుకునేలా, నడిచేందుకు తగిన స్థలం ఉండేలా అమరిక చేయాలి.

ఉదయం అల్పాహారంలో ఈ మార్పులు..

రోజంతా ఉత్సాహంగా ఉండేందుకు



ఉదయం తీసుకునే ఆహారం శరీరానికి అవసరమైన శక్తి, పోషకాలను అందించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఖరీదైన ఆహార పదార్థాల కంటే మన ఇంట్లో లభించే సమతుల ఆహారానికే ప్రాధాన్యం ఇవ్వాలి.

అల్పాహారాన్ని నిర్లక్ష్యం చేయొద్దు

ఉదయం నిద్రలేచిన తర్వాత పనులు, ప్రయాణాలు, ఉద్యోగ బాధ్యతల కారణంగా చాలామంది అల్పాహారాన్ని వాయిదా వేస్తుంటారు. కొందరు కేవలం టీ లేదా కాఫీ తాగి బయటకు వెళ్తారు. మరికొందరు మధ్యాహ్నం వరకు ఏమీ తినకుండా ఉంటారు. ఇలా చేయడం అందరికీ తప్పనిసరిగా హానికరం అని చెప్పలేం. అయితే ఆకలి ఉన్నప్పటికీ అల్పాహారాన్ని నిరంతరం వదిలేయడం వల్ల కొందరిలో అలసట, ఏకాగ్రత తగ్గడం, తరువాత అతిగా తినడం వంటి సమస్యలు కనిపించవచ్చు.

ఉదయం తీసుకునే ఆహారం రోజువారీ శక్తి అవసరాలను తీర్చడంలో భాగం కావాలి. రాత్రి భోజనం నుంచి ఉదయం వరకు గ్యాప్ ఎక్కువగా ఉన్నప్పుడు ఆకలిని బట్టి తగిన ఆహారం తీసుకోవడం ఉపయోగకరం. ప్రతి ఒక్కరి జీవనశైలి, పని సమయం, ఆరోగ్య పరిస్థితి వేర్వేరుగా ఉంటాయి. అందువల్ల అందరికీ ఒకే అల్పాహార పద్ధతి సరిపోతుందని భావించకూడదు.

ఇడ్లీ, దోసెతో పాటు పోషకాలూ అవసరమే

తెలుగు ఇళ్లలో ఇడ్లీ, దోసె, ఉప్మా, అటుకులు, రాగి జావ, పెసరట్టు వంటి అల్పాహారాలు సాధారణంగా ఉంటాయి. వీటిని మరింత సమతులంగా చేసుకోవడానికి పప్పులు, కూరగాయలు, పాలు లేదా పెరుగు, పండ్లు వంటి పదార్థాలను చేర్చవచ్చు.

ఇడ్లీతో సాంబారు తీసుకుంటే పప్పులు, కూరగాయల ద్వారా అదనపు పోషకాలు లభిస్తాయి. పెసరట్టులో ప్రోటీన్ ఉంటుంది. కూరగాయల ఉప్మా ద్వారా పీచు పదార్థాలు అందుతాయి. అయితే నూనె, ఉప్పు మోతాదును నియంత్రించడం మంచిది. అల్పాహారంలో ప్రోటీన్ ఉండేలా చూసుకోవడం కూడా ఉపయోగకరం. పాలు, పెరుగు, పప్పులు, గుడ్లు లేదా వ్యక్తిగత ఆహార అలవాట్లకు సరిపోయే ప్రత్యామ్నాయాలను ఎంచుకోవచ్చు. వీటితో పాటు పండ్లు తీసుకుంటే విటమిన్లు, ఖనిజాలు అందుతాయి.

టీ, కాఫీ మాత్రమే సరిపోతాయా?

టీ లేదా కాఫీ తాగడం వల్ల కొంతసేపు చురుకుదనం అనిపించవచ్చు. అయితే అవి సమతుల అల్పాహారానికి ప్రత్యామ్నాయం కావు. చక్కెర ఎక్కువగా కలిపిన పానీయాలను తరచుగా తీసుకోవడం వల్ల అదనపు కేలరీలు చేరుతాయి. ఖాళీ కడుపుతో టీ లేదా కాఫీ తాగితే కొందరిలో గుండెల్లో మంట, కడుపులో అసౌకర్యం లేదా ఆందోళన పెరగవచ్చు. అలాంటి సమస్యలు ఉంటే మోతాదును తగ్గించడం, ఆహారం తీసుకున్న తర్వాత పానీయం తాగడం వంటి మార్పులు ప్రయత్నించవచ్చు.

ముందుగానే సిద్ధం చేసుకుంటే సమయం ఆదా

ఉదయం సమయం తక్కువగా ఉండేవారు రాత్రే కొన్ని ఏర్పాట్లు చేసుకోవచ్చు. పప్పులు నానబెట్టడం, కూరగాయలు శుభ్రం చేయడం, అవసరమైన పదార్థాలను సిద్ధంగా ఉంచడం ద్వారా అల్పాహారం తయారీ సులభమవుతుంది. ఓట్స్, పండ్లు, పెరుగు వంటి త్వరగా సిద్ధమయ్యే పదార్థాలు కూడా ఉపయోగపడతాయి. పిల్లలకు అల్పాహారం పెట్టేటప్పుడు రంగురంగుల పండ్లు, చిన్న పరిమాణాల్లో విభిన్న పదార్థాలు ఇవ్వడం ద్వారా కొత్త రుచులను పరిచయం చేయవచ్చు. పెద్దలు కూడా పిల్లల ముందు ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకుంటే మంచి అలవాట్లు ఏర్పడే అవకాశం ఉంటుంది.

గుర్తుంచుకోవాల్సిన విషయం

ఆరోగ్యకరమైన అల్పాహారం అంటే ఖరీదైన పదార్థాలు మాత్రమే కాదు. స్థానికంగా లభించే ధాన్యాలు, పప్పులు, కూరగాయలు, పండ్లతోనే మంచి ఎంపికలు చేసుకోవచ్చు. మధుమేహం, మూత్రపిండాల సమస్యలు లేదా ప్రత్యేక ఆహార అవసరాలు ఉన్నవారు వైద్యుడు లేదా పోషకాహార నిపుణుడి సూచనలకు అనుగుణంగా ఆహారాన్ని ఎంచుకోవాలి. రోజూ ఒకే పదార్థాన్ని తీసుకోవడం కంటే వైవిధ్యం ఉండేలా చూసుకోవాలి. ఆకలి, శారీరక శ్రమ, ఆరోగ్య పరిస్థితిని బట్టి పరిమాణాన్ని నిర్ణయించుకోవాలి. అల్పాహారం రోజంతా ఆరోగ్యంగా ఉండేందుకు తోడ్పడే భాగం మాత్రమే. దానితో పాటు తగిన నిద్ర, నీరు, శారీరక చురుకుదనం కూడా అవసరం.

రాత్రి నిద్రకు ముందు ఫోన్ వాడకం తగ్గిస్తే ఏమవుతుంది?

నిద్రకు ముందు ఫోన్ చూస్తూ ఎక్కువ సమయం గడపడం వల్ల నిద్ర సమయం తగ్గవచ్చు. చిన్న మార్పులతో రాత్రి విశ్రాంతిని మెరుగుపరుచుకోవచ్చు.

నిద్రను దూరం చేస్తున్న తెరలు

రోజంతా పని చేసిన తర్వాత చాలామంది విశ్రాంతి కోసం ఫోన్ తీసుకుంటారు. సామాజిక మాధ్యమాలు చూడటం, చిన్న వీడియోలు వీక్షించడం, సందేశాలు చదవడం మొదలుపెడతారు. కొన్ని నిమిషాల కోసం తెరిచిన ఫోన్‌లో గంటల సమయం గడిచిపోవచ్చు. ఫలితంగా నిద్రపోయే సమయం ఆలస్యమవుతుంది.

ఫోన్ తెర నుంచి వచ్చే కాంతి, ముఖ్యంగా రాత్రి వేళల్లో, శరీరంలోని సహజ నిద్ర--మేల్కొనే చక్రాన్ని ప్రభావితం చేయవచ్చు. అయితే కాంతి ఒక్కటే కారణం కాదు. ఆసక్తికరమైన వీడియోలు, ఆందోళన కలిగించే వార్తలు, పని సందేశాలు కూడా మెదడును చురుకుగా ఉంచుతాయి.

నిద్ర తగ్గినప్పుడు మరుసటి రోజు అలసట, ఏకాగ్రత లోపం, చిరాకు, పనితీరు తగ్గడం వంటి సమస్యలు ఎదురవచ్చు. నిరంతర నిద్రలేమి ఆరోగ్యంపైనా ప్రభావం చూపవచ్చు.

పడుకునే ముందు ఒక గంట ప్రశాంతత

ప్రతి ఒక్కరికీ ఒకే పద్ధతి సరిపోకపోయినా, నిద్రకు ముందు కనీసం 30--60 నిమిషాల పాటు ఫోన్ వినియోగాన్ని తగ్గించడం ప్రయత్నించవచ్చు. ఆ సమయంలో పుస్తకం చదవడం, తేలికపాటి సంగీతం వినడం, మరుసటి రోజు పనులకు సిద్ధం కావడం వంటి అలవాట్లను ఏర్పరచుకోవచ్చు.

ఫోన్‌ను మంచం పక్కన కాకుండా కొంత దూరంలో ఉంచడం కూడా ఉపయోగపడుతుంది. అలారం కోసం ఫోన్ అవసరమైతే నోటిఫికేషన్లను నిలిపివేయడం లేదా అంతరాయం కలిగించని విధానాన్ని ఉపయోగించడం మంచిది.

నిద్రకు ముందు పని సంబంధిత సందేశాలను చూడటం అలవాటైతే, మరుసటి రోజు ఉదయం వాటిని పరిశీలించే సమయాన్ని నిర్ణయించుకోవచ్చు. అత్యవసర పరిస్థితులకు అవసరమైన సంప్రదింపులు మాత్రం అందుబాటులో ఉండేలా చూసుకోవాలి.

స్థిరమైన నిద్ర సమయం

ప్రతిరోజూ దాదాపు ఒకే సమయంలో నిద్రపోవడం, మేల్కొనడం శరీరానికి ఒక క్రమాన్ని ఏర్పరుస్తుంది. వారాంతాల్లోనూ నిద్ర సమయాన్ని పూర్తిగా మార్చకుండా ఉండటం ఉపయోగకరం.

పెద్దలకు సాధారణంగా రాత్రికి ఏడు నుంచి తొమ్మిది గంటల నిద్ర అవసరమవుతుంది. వయస్సు, ఆరోగ్య పరిస్థితి, వ్యక్తిగత అవసరాలను బట్టి ఇది మారవచ్చు. నిద్రకు ముందు అధికంగా కెఫీన్ తీసుకోవడం, రాత్రివేళల్లో భారీ భోజనం చేయడం, మద్యం సేవించడం కొందరిలో నిద్ర నాణ్యతను ప్రభావితం చేయవచ్చు.

పడకగదిని నిద్రకు అనుకూలంగా మార్చండి

గది ప్రశాంతంగా, చీకటిగా, సౌకర్యవంతమైన ఉష్ణోగ్రతలో ఉండేలా చూసుకోవాలి. శబ్దం ఎక్కువగా ఉంటే వీలైనంత తగ్గించాలి. మంచాన్ని పని చేసే ప్రదేశంగా మార్చకుండా ఉండటం కొందరికి ఉపయోగపడుతుంది. పగటిపూట శారీరక చురుకుదనం, సహజ కాంతిలో కొంత సమయం గడపడం కూడా నిద్ర క్రమాన్ని మెరుగుపరచడంలో సహాయపడవచ్చు. అయితే పడుకునే సమయానికి దగ్గరగా తీవ్రమైన వ్యాయామం కొందరికి నిద్రను ఆలస్యం చేయవచ్చు.

ఎప్పుడు వైద్య సహాయం అవసరం?

తగిన సమయం నిద్రపోయినా నిరంతరం అలసటగా ఉండటం, గట్టిగా గురక పెట్టడం, నిద్రలో శ్వాస ఆగినట్లు అనిపించడం, వారాల తరబడి నిద్ర పట్టకపోవడం వంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకూడదు. వైద్యుడిని సంప్రదించడం మంచిది.

ఫోన్ వినియోగాన్ని తగ్గించడం ఒక్కటే అన్ని నిద్ర సమస్యలను పరిష్కరించదు. అయినప్పటికీ రాత్రి విశ్రాంతికి అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించడంలో ఇది ఒక ఉపయోగకరమైన మార్పు.

పిల్లలతో సమయం..

కుటుంబ బంధాలను బలోపేతం చేసే అలవాట్లు

పిల్లలతో ప్రతిరోజూ కొంత సమయం గడపడం వారి భావోద్వేగ భద్రత, భాషా నైపుణ్యాలు, కుటుంబ అనుబంధానికి తోడ్పడుతుంది.

సమయం కంటే దాని నాణ్యత ముఖ్యం

ఉద్యోగం, ఇంటి పనులు, ప్రయాణాల మధ్య తల్లిదండ్రులకు పిల్లలతో ఎక్కువసేపు గడపడం కష్టంగా ఉండవచ్చు. అయితే ప్రతిరోజూ కొంత సమయాన్ని పూర్తిగా పిల్లల కోసం కేటాయించడం మంచి అలవాటు.

పిల్లలు మాట్లాడుతున్నప్పుడు ఫోన్‌ను పక్కన పెట్టి శ్రద్ధగా వినడం, వారి రోజులో జరిగిన విషయాలు అడగడం, కలిసి ఆడుకోవడం వంటి చర్యలు చిన్నవిగా కనిపించినా కుటుంబ బంధాన్ని బలోపేతం చేస్తాయి. పిల్లలు తమ అభిప్రాయాలను చెప్పడానికి అవకాశం ఉందనే భావనను పొందుతారు.

పిల్లలతో గడిపే సమయాన్ని ఖరీదైన ఆట వస్తువులు లేదా బయట విహారయాత్రలకే పరిమితం చేయాల్సిన అవసరం లేదు. కలిసి కథలు చదవడం, చిత్రాలు గీయడం, ఇంటి పనుల్లో చిన్న సహాయం చేయడం, పార్కులో నడవడం వంటి సాధారణ కార్యకలాపాలే సరిపోతాయి.

కుటుంబంతో కలిసి భోజనం

సాధ్యమైనప్పుడు కుటుంబ సభ్యులంతా కలిసి భోజనం చేయడం మంచి అలవాటు. ఆ సమయంలో రోజులో జరిగిన విషయాలు పంచుకోవచ్చు. పిల్లలు తమ అనుభవాలను చెప్పడానికి, ఇతరుల మాట వినడానికి అవకాశం లభిస్తుంది. భోజనం సమయంలో టీవీ, ఫోన్ల వినియోగాన్ని తగ్గిస్తే పరస్పర సంభాషణ పెరగవచ్చు. అయితే కుటుంబాల పని సమయాలు వేర్వేరుగా ఉండవచ్చు. ప్రతిరోజూ అందరూ ఒకేసారి భోజనం చేయడం సాధ్యం కాకపోయినా, వారంలో కొన్ని సందర్భాల్లో కలిసి కూర్చునేలా ప్రణాళిక చేసుకోవచ్చు. పిల్లల ఆహారపు అలవాట్లను అభివృద్ధి చేయడంలో పెద్దల ప్రవర్తన కూడా ప్రభావం చూపుతుంది. పెద్దలు పండ్లు, కూరగాయలు తీసుకోవడం, ఆహారాన్ని వృథా చేయకపోవడం వంటి అలవాట్లను పాటిస్తే పిల్లలు కూడా నేర్చుకునే అవకాశం ఉంటుంది.

భావోద్వేగాలను అర్థం చేసుకోవాలి

పిల్లలు కోపం, భయం, నిరాశ వంటి భావాలను ఎప్పుడూ స్పష్టంగా చెప్పలేకపోవచ్చు. వారు ఏడవడం లేదా మొండిగా ప్రవర్తించడం వెనుక అలసట, ఆకలి, ఆందోళన వంటి కారణాలు ఉండవచ్చు. అలాంటి సందర్భాల్లో వెంటనే శిక్షించకుండా, ఏమైందో ప్రశాంతంగా తెలుసుకోవడానికి ప్రయత్నించాలి. భావోద్వేగాలను గుర్తించడం నేర్పుతూ, ఇతరులకు హాని చేయకుండా వాటిని వ్యక్తపరచే మార్గాలను చూపించాలి. అదే సమయంలో స్పష్టమైన పరిమితులు కూడా అవసరం. ఇతరులను కొట్టడం, వస్తువులు విసరడం వంటి ప్రవర్తనను అంగీకరించకూడదు. కానీ తప్పును వివరించే విధానం వయస్సుకు అనుగుణంగా, గౌరవప్రదంగా ఉండాలి.

పిల్లలకు ఖరీదైన బహుమతుల కంటే ప్రేమ, భద్రత, శ్రద్ధ, స్థిరమైన కుటుంబ మద్దతు ముఖ్యమైనవి. రోజూ కొంత సమయాన్ని వారికోసం కేటాయించడం దీర్ఘకాలంలో మంచి కుటుంబ బంధాలకు పునాది వేస్తుంది.

ఇంట్లోనే ఆరోగ్యకరమైన ఆహారం..

కుటుంబ బడ్జెట్‌కూ మేలు

ఇంట్లో వండిన ఆహారం ద్వారా పదార్థాల నాణ్యత, ఉప్పు, నూనె మోతాదులను నియంత్రించుకోవచ్చు. ముందస్తు ప్రణాళికతో ఖర్చులనూ తగ్గించవచ్చు.

పని ఒత్తిడి, సమయాభావం కారణంగా చాలామంది తరచూ బయట ఆహారం లేదా ఆన్‌లైన్ ద్వారా ఆహారాన్ని తెప్పించుకుంటున్నారు. అప్పుడప్పుడు ఇలా చేయడం తప్పనిసరిగా సమస్య కాదు. అయితే ప్రతిరోజూ అధిక ఉప్పు, నూనె, చక్కెర కలిగిన ఆహారాన్ని తీసుకుంటే సమతుల ఆహారాన్ని పాటించడం కష్టమవుతుంది. ఇంట్లో వండేటప్పుడు ఉపయోగించే పదార్థాలను మనమే ఎంచుకోవచ్చు. కూరగాయల పరిమాణం పెంచడం, పప్పులు చేర్చడం, నూనెను కొలిచి ఉపయోగించడం, ఉప్పును పరిమితంగా ఉంచడం సాధ్యమవుతుంది. కుటుంబ సభ్యులకు అనుగుణంగా ఆహారాన్ని సిద్ధం చేసుకోవచ్చు.

వారానికి ఒకసారి ప్రణాళిక

ప్రతిరోజూ ఏమి వండాలో చివరి నిమిషంలో నిర్ణయించడం వల్ల సమయం వృథా కావచ్చు. వారానికి అవసరమైన ప్రధాన వంటకాలను ముందుగానే నిర్ణయించుకుంటే కిరాణా సరుకుల కొనుగోలు సులభమవుతుంది.

ఉదాహరణకు, ఒక రోజు పప్పు, కూరగాయలు, అన్నం; మరో రోజు చపాతీ, కూర; ఇంకొక రోజు ఇడ్లీ లేదా పెసరట్టు వంటి ఎంపికలను చేసుకోవచ్చు. స్థానికంగా లభించే కాలానుగుణ కూరగాయలను ఎంచుకోవడం వల్ల ఖర్చు తగ్గవచ్చు.

ఆహార వృథాను తగ్గించండి

వంట చేసే ముందు ఇంట్లో ఉన్న పదార్థాలను పరిశీలించడం మంచిది. మిగిలిన ఆహారాన్ని సురక్షితంగా నిల్వచేసి, అవసరమైనప్పుడు పూర్తిగా వేడి చేసి ఉపయోగించుకోవచ్చు. అయితే గది ఉష్ణోగ్రత వద్ద ఎక్కువసేపు ఉంచిన ఆహారాన్ని తినడం ప్రమాదకరం. వండిన ఆహారాన్ని త్వరగా చల్లబరచి రిఫ్రిజిరేటర్‌లో నిల్వ చేయాలి. నిల్వ సమయం, ఆహార రకం ఆధారంగా భద్రతా నియమాలను పాటించాలి. వాసన లేదా రూపం సాధారణంగా కనిపించినంత మాత్రాన ఆహారం సురక్షితమని నిర్ధారించలేం.